Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 19.12.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 29 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## విమర్శల వార్...
# మాటలతో ఫైర్

**ఒకప్పుడు విమర్శలు రాజకీయాలకే పరిమితమయ్యేవి. ఆ తర్వాత రాజకీయ విమర్శలు వ్యక్తిగత జీవితాలలోకి చొరబడ్డాయి. తాజాగా రాజకీయాలలోకి సినిమా డైలాగ్‌లు కూడా ప్రవేశించాయి.**





**విమర్శలు, ప్రతివిమర్శలు ఉంటేనే రాజకీయం రంజుగా ఉంటుంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతోనే ప్రతిరోజూ రాజకీయ సీన్‌లు రక్తికడుతుంటాయి.**





నెల్లూరుజిల్లా ఉద్దండరాజకీయ పిండాల ఉత్పత్తికేంద్రం. పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహానాయకుడిని మొదలుకొని బెజవాడ గోపాలరెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, యం.వెంకయ్యనాయుడు వంటి రాజకీయ దిగ్గజాలు ఇక్కడ నుండే ఉత్పత్తి అయ్యారు. వీరంతా కూడా ఎంతో ఉన్నతమైన రాజకీయాలు నడిపారు. వీరి విమర్శలు, ప్రతి విమర్శలు ఎంతో అర్ధవంతంగా ఉండేవి.

గత కాంగ్రెస్‌ప్రభుత్వ హయాంలో అయితే జిల్లాలో ఆనం సోదరులు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంటి నాయకుల మధ్య పలుమార్లు విమర్శలయుద్ధం నడిచింది. చాలా సార్లు వాళ్లు రాజకీయ విమర్శలను వదిలి ఒకర్నొకరు తిట్టుకుంటూ వ్యక్తిగత జీవితాలలోకి కూడా వెళ్లిపోయారు.

ఇప్పుడు మరోరకం విమర్శల యుద్ధం నడుస్తోంది. రాజకీయ విమర్శలలో సినిమా డైలాగ్‌లు మిక్స్ అవుతున్నాయి. ముఖ్యంగా జిల్లాలో మంత్రి పి.నారాయణను టార్గెట్ చేసుకుని నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఘాటుగా విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. జిల్లాలో ఇద్దరు ప్రతిపక్ష ఎంపీలు, ఏడుమంది ఎమ్మెల్యేలున్నా మంత్రిపై ఎవరూ విమర్శలు చేయలేదు. వాస్తవానికి జిల్లాలో పరిస్థితులు దారుణంగానే వున్నాయి. ప్రభుత్వపరంగా ఎలాంటి పనులు (మిగతా 10వ పేజీలో)




## ఆ బాల గోపాలాన్ని అలరించిన...
# 'తానా' పండుగ



**తెలుగుతనం ఉట్టిపడింది. తెలుగుపాట ప్రవాహమై పారింది, తెలుగు సంస్కృతి వెల్లివిరిసింది. తెలుగుకళలు వెలుగులీనాయి. తెలుగు భాష, తెలుగుయాస పాటై పోటెత్తింది. తెలుగు జానపదాలు గజ్జెకట్టి నాట్యమాడాయి...**

***ఈ*** *కార్యక్రమానికి రాకపోయి వుంటే ఎంతో కోల్పోయి వుండేవాళ్లమని వచ్చి చూసిన వాళ్లు అనుకునేంతగా... పోయి చూసుంటే బాగుండేదని రానివాళ్లు బాధపడేంతగా తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) 20వ ద్వైవార్షిక సదస్సును పురస్కరించుకుని 'చైతన్య స్రవంతి' వేడుకలు ఈ నెల 18న నెల్లూరురూరల్ కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు అత్యంత వైభవంగా జరిగాయి.*

ఆకాశం ఓ వైపు మేఘావృతమై ఉరుముతున్నా, అనివార్య కారణాల వలన 'తానా' వేడుకల వేదికను ఒకరోజు ముందు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్ నుండి విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు మార్చినా, ప్రేక్షకులు వర్షాన్ని, దూరాన్ని లెక్క చేయకుండా తండోపతండాలుగా వచ్చి ఈ వేడుకలను తిలకించారు. ముఖ్యంగా నగరంలో పలు పాఠశాలల విద్యార్థులు వేలసంఖ్యలో తరలివచ్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ కళారూపాల స్టాల్స్‌ను, హాల్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను కన్నార్పకుండా ఆసక్తిగా తిలకించారు.

ఉదయం 9గంటలకు జ్యోతిప్రజ్వలనతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రారంభసభకు ఏపిఐఐసి ఛైర్మెన్ పి.కృష్ణయ్య, శాసన మండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సూళ్లూరుపేట చెంగాళమ్మ దేవస్థానం మాజీఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు సి. హెచ్.హరిబాబుయాదవ్, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, తానా ప్రతినిధులుగా రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, మోహన్ నన్నపనేని, జంపాల చౌదరి, గంగాధర్ నాదేళ్ల, జయరామ్ కోమటి, సతీష్ వేమన, మధు తాత, అంజయ్యచౌదరి, రవి గౌరినేని, రజని ఆకురాతి, వాసుదేవరెడ్డి, రవి పొట్లూరి, గౌతం గుర్రం, రామ్ జక్కేపూడి, నరేంద్ర ఏలూరు, హరిత చదివి, రామ్ యలమంచిలి తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం జరిగిన ముగింపు సభలో నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజధాని కమిటి సభ్యులు బీదా మస్తాన్‌రావు, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీమతి రేఖారాణి, ఆర్‌డివో సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, అలయన్స్ గ్రూప్ ఛైర్మెన్ మనోజ్ నంబూరులతో పాటు తానా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి సాహిత్య అవార్డును (మిగతా 6, 7 పేజీలో)



# పాలకమండళ్ళను నియమించాలి

## సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి డిమాండ్

ఆలయాలకు పాలకమండళ్ళు లేకపోవడంతో ఆలయాల అభివృద్ధి నామమాత్రంగానే వుందని, వెంటనే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వున్న అన్ని ప్రముఖ ఆలయాలకు పాలకమండళ్ళను నియమించి ఆలయాల ప్రగతికి చర్యలు తీసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 13న ఆయన పెంచలకోన ఆలయానికి విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, దేవస్థానాల అభివృద్ధి విషయంలో సంబంధిత అధికారులు సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని, దీంతో భక్తులు ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. టిటిడి పాలకమండలి ఏర్పాటుకాకపోవడంతో, అక్కడంతా అధికారుల ఇష్టారాజ్యంగా వుందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. తిరుమలలోని జెఇఓ క్యాంప్ కార్యాలయం అవినీతికి నిలయంగా మారిందని ఆయన ఆరోపిస్తూ, దీనికి సంబంధించి అన్ని వివరాలు సేకరించి అసెంబ్లీ దృష్టికి తీసుకువస్తామన్నారు. జిల్లాలోని పెంచలకోన క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ఈ ఆలయం ఇంత బాగా అభివృద్ధి చెందడానికి కారణం పాలకమండలి కృషేనని ఆయన అన్నారు. పాలకమండళ్ళు ఏర్పాటైతే ప్రభుత్వ నిధులతో పాటు, దాతల సహకారంతో నిధులు సేకరించి ఆలయాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసే అవకాశం వుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, వైఎస్సార్సీపి ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్‌యాదవ్, నాయకులు బత్తిన పట్టాభిరామిరెడ్డి, శివకుమార్‌రెడ్డి తదితరులు వున్నారు.

# అర్హత గల ప్రతి రైతుకీ రుణమాఫీ

## కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి

అర్హత కలిగిన ప్రతి రైతుకీ రుణమాఫీ వర్తిస్తుందని, రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. కొడవలూరు మండలంలోని తలమంచి గ్రామంలో సోమవారం జరిగిన రైతు సాధికారత సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తలమంచిలో వ్యవసాయ సొసైటీ బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు కోటి70వేల రూపాయలు రుణవిముక్తి జరిగిందన్నారు. రుణవిముక్తి జాబితాలో పేరు రాని వారు ఎవరైనా వుంటే, ఈనెల 17వతేదిన కమిటీ ద్వారా సరిచేసుకున్నవారికి, రెండవ జాబితాలో తప్పనిసరిగా రుణవిముక్తి జరుగు తుందన్నారు. తొలుత, టిడిపి మండల కన్వీనర్ జొన్నా శివకుమార్ ఎమ్మెల్యే పోలంరెడ్డిని ఘనంగా స్వాగతించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జివిఎస్ శేఖరరెడ్డి, తలమంచి సొసైటీ అధ్యక్షులు కొల్లు శ్రీనివాసులు, సర్పంచ్ అయ్యమ్మ, ఉపసర్పంచ్ వేగూరు సురేష్‌కుమార్, మణి, కటారి ప్రసాద్, పులిమి పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్లు, చిముకుల వెంకయ్య, ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖాధికారి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

# గ్రామగ్రామానా బిజెపి సభ్యత్వాలు

## కర్నాటి ఆంజనేయరెడ్డి

ఆత్మకూరు నియోజకవర్గంలో గ్రామగ్రామానా బిజెపి సభ్యత్వాలను నమోదు చేయాలని బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఆత్మకూరు బస్టాండ్ ఆవరణంలో జరిగిన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ ఘన విజయం సాధించిందని, తమను ఆదరించి అఖండ విజయం చేకూర్చిపెట్టిన దేశప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రధాని నరేంద్రమోడీ విశేష కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ఓట్లు వేసిన ప్రతిఒక్కరినీ పార్టీలో సభ్యులుగా చేర్పించేందుకు కృషి చేయాలని, తద్వారా దేశంలో అత్యధిక సభ్యులు కలిగిన పార్టీగా బిజెపి రికార్డు సాధించేందుకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల కోసం ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన అనేకానేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు గ్రామగ్రామాన వున్న ప్రజలకు తెలియపరచాలని ఆయన కోరారు.

బిజెపి జిల్లా శాఖ అధ్యక్షులు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆరేళ్ళకొకసారి నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గతంలో సభ్యత్వం తీసుకున్నవారు, ఇప్పుడు కొత్తగా సభ్యత్వం తీసుకునేవారు అందరూ మళ్ళీ సభ్యులుగా చేరాల్సివుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి కుడుముల సుధాకరరెడ్డి, నాయకులు చెరుకూరు రమణయ్యనాయుడు, అల్లంపాటి రమణారెడ్డి, బత్తల కృష్ణయ్య, కె.బుజ్జిరెడ్డి, ఆత్మకూరు బిజెపి నాయకులు కరటంపాటి సుధాకర్‌లతో పాటు అన్ని మండలాల, గ్రామాలకు చెందిన బిజెపి నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆనకట్టకు షట్టర్ ఏర్పాటు

నెల్లూరుజిల్లా సంగం ఆనకట్టకు 1884లో సర్ ఆర్థర్ కాటన్ ఏర్పాటు చేసిన షట్టర్ మరమ్మత్తులకు గురికావడంతో దాని స్థానంలో ఆదివారం ఇరిగేషన్ అధికారులు దాదాపు 4టన్నుల షట్టర్‌ను భారీ క్రేన్ సహాయంతో పాతషట్టర్‌కు ముందు భాగంలో నీరు వృధాపోకుండా బిగించారు. సంగం ఆనకట్ట నుంచి నెల్లూరు చెరువుకు సాగునీరు విడుదలచేసే షట్టర్లలో ఒకటి మరమ్మత్తుకు గురై నీరు వృధాగా పోతుండడంతో సాగునీటి అధికారులు యుద్ధప్రాతిపదికన కొత్త షట్టర్‌ను ఏర్పాటు చేసారు. ఇరిగేషన్ శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డిఇ శివప్రసాద్, ఏఇ శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ప్రతి చెరువుకూ తెలుగుగంగ నీరు

## - తిరుపతి ఎంపి వరప్రసాదరావు

నెల్లూరుజిల్లా గూడూరు నియోజకవర్గంలో ప్రతి చెరువుకూ తెలుగుగంగ నీరు సరఫరా అయ్యేలా కృషి చేస్తానని తిరుపతి ఎంపి వెలగపల్లి వరప్రసాదరావు పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా చిట్టమూరు మండలంలోని మల్లాంలో చెన్నారెడ్డి బాబురెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల ఆత్మీయసమావేశంలో ఎంపి మాట్లాడుతూ రానున్న రెండేళ్లలో రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు. సాగునీటికి ఈ ప్రాంత రైతులు అవస్థలు పడుతున్నారని, తెలుగుగంగ కాలువ పనులు పూర్తిచేసి అన్ని చెరువులకు నీరు వచ్చేలా పార్లమెంటులో చర్చించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబునాయుడు రైతు రుణమాఫీ అని చెప్పి ఓట్లు వేయించుకుని సీఎం అయ్యాక రైతులను మోసం చేసారన్నారు. నాయుడుపేట - దుగరాజపట్నం రోడ్డు విస్తరణకు కృషి చేస్తామన్నారు.

నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పనిచేసి తాగునీరు, రోడ్లు, పాఠశాల అదనపు భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించి జిల్లాను అభివృద్ధిపథంలో నడిపిస్తానన్నారు.



గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ తెలుగుగంగ నీటి కోసం రాజీలేని పోరాటం చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, చెన్నారెడ్డి బాబురెడ్డి, చిల్లకూరు ప్రకాష్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, వేణురెడ్డి, మారంరెడ్డి కృష్ణారెడ్డి, వాకాటి వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుప్తనిధుల కోసం తవ్వకాలు

## - గ్రామదేవత పోలేసమ్మ ఆలయం ధ్వంసం




**పురాతన ఆలయాల్లో గుప్తనిధులు వుంటాయని భావించి, అలాంటి ఆలయాల్లో తవ్వకాలు సాగించే దుండగుల ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. గుప్తనిధుల కోసం వీరు ఆలయాలను సైతం ధ్వంసం చేస్తున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించుకున్న దేవతామూర్తుల విగ్రహాలను నిర్ధాక్షిణ్యంగా తవ్వి కిందపడేస్తున్నారు. రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఆలయాల్లో ప్రవేశించి, గుప్త నిధుల కోసం ఇష్టానుసారం తవ్వకాలు సాగిస్తున్నారు.**

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ఇలాంటి దుశ్చర్యలు మరీ మితిమీరి పోతున్నాయి. అందుకు తాజా ఉదాహరణే ఇటీవల జరిగిన ఓజిలి మండలంలోని పినపరియపాడు సంఘటన. ఈ గ్రామంలో ఎన్నో ఏళ్ళ చరిత్ర కలిగిన గ్రామదేవత పోలేసమ్మ ఆలయం వుంది. గ్రామస్తులు అమ్మవారి ఆలయాన్ని ఎంతో పవిత్రంగా చూసుకుంటారు. పండుగల రోజుల్లో పూజలు చేస్తుంటారు. ఏటా అమ్మవారికి వైభవంగా జాతర చేస్తుంటారు. గ్రామానికి దూరంగా పొలాల్లో ఈ ఆలయం వుంది. ఈ ఆలయం పురాతనమైనది కనుక, ఇక్కడ గుప్తనిధులుంటాయేమోనని భావించిన దుండగులు ఈ ఆలయంపై కన్నేసినట్లుందని, తవ్వకాల్లో ఆలయాన్నంతా దుండగులు ధ్వంసం చేశారని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 13వతేది రాత్రి ఈ సంఘటన జరిగినట్లు వారు భావిస్తున్నారు. రాత్రివేళ ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు, అమ్మవారి విగ్రహాన్ని పెకలించి పక్కన పడేశారని, గుడిలో సుమారు అయిదడుగులు లోతు తవ్వకాలు జరిపారని, ఆలయాన్ని ధ్వంసం చేశారని, పలు విలువైన దేవతామూర్తుల విగ్రహాలను కూడా ఎత్తుకుపోయారని గ్రామస్తులు వాపోతున్నారు. తవ్వకాలు జరిపే ముందుగా గుడి వెలుపల టెంకాయలు కొట్టి, పూజలు నిర్వహించినట్లు అక్కడ పడేసివున్న పూజా సామగ్రిని బట్టి తెలుస్తోందని వారు పేర్కొంటున్నారు. ఆ మేరకు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

ఈ సమాచారం తెలిసిన వెంటనే ఎఎస్ఐ తిరుపాల్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించి, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. గతంలో కూడా ఈ ఆలయ పరిసరాల్లో పలుసార్లు ఎవరో గుర్తుతెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు సాగించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇలాంటి సంఘటనల పట్ల పోలీసులు, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, గుప్తనిధుల తవ్వకాల ముఠాలను పట్టుకునేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని పురాతన ఆలయాల్లోనూ, చరిత్రాత్మకమైన ఆలయాల్లోనూ, అన్ని ప్రధానమైన ఆలయాల్లోనూ ప్రత్యేక నిఘాబృందాలను ఏర్పాటుచేసి, ఆలయాల పరిరక్షణకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# గజదొంగ అరెస్ట్

## పలు వాహనాలు స్వాధీనం

గత రెండేళ్ళుగా పోలీసులు కళ్ళుగప్పి పలు దొంగతనాలకు పాల్పడుతున్న గజదొంగను కావలి పోలీసులు అరెస్ట్ చేశారు. కావలి రూరల్ సిఐ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆ నిందితుని వివరాలను డిఎస్పీ మోహన్‌రావు విలేకరులకు వివరించారు.

పలు చోరీల కేసుల్లో నిందితుడిగా వున్న మందా హరీష్‌రెడ్డి, బెయిల్‌మీద బయటకువచ్చి పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతూ పలు వాహనాలను అపహరించాడని, విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి పలు చోరీలకు పాల్పడ్డాడని ఆయన తెలిపారు. కావలి సమీపంలోని ముసునూరురోడ్ వద్ద తనిఖీలు చేస్తున్న సందర్భంగా అందిన సమాచారం మేరకు, జిల్లా ఎస్పీ ఆదేశాలతో 1వ పట్టణ సిఐ వెంకటరావు, 2వ పట్టణ సిఐ మంగారావు, గ్రామీణ సిఐ మధుబాబు పర్యవేక్షణలో, రూరల్ ఎస్ఐ రహీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిందితుని అరెస్ట్ చేశామన్నారు. అతని నుంచి వివరాలు రాబట్టగా, దాదాపు రూ.30లక్షల విలువైన వాహనాలను అతను దొంగిలించినట్లు అంగీకరించాడని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిందితుని నుంచి మూడు కార్లు, 4 బైక్‌లు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో నెల్లూరు, గూడూరు ప్రాంతాల్లో లారీల టైర్లను దొంగిలించిన కేసులో కూడా ఇతను ముద్దాయి అని ఆయన తెలిపారు. పలు కేసుల్లో నిందితుడైన ఇతనిని చాకచక్యంగా అరెస్ట్ చేయడంలో సహకరించిన పోలీసు సిబ్బందికి రివార్డులను ప్రకటించామన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీతో పాటు ఐ.డి పార్టీ సిబ్బంది వెంకయ్య, రవికుమార్, రమేష్‌కుమార్, సుబ్బారావు, అయోధ్యకుమార్, మాధవ, శ్రీనివాసులరెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు తీర్చాలంటూ వినతులు

తమ సమస్యలు తీర్చాలంటూ నెల్లూరు డివిజన్‌లోని పలు మండలాల ప్రజలు సోమవారం గ్రీవెన్స్‌డేలో అధికారులకు విన్నవించుకున్నారు.

నగరంలోని ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాల్లో జరిగిన గ్రీవెన్స్‌డేలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు అర్జీలు ఇచ్చారు. ఆర్డీఓ పివి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సంప్రదించారు. ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో తహశీల్దార్ జనార్దనరావు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి, ఆ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

# తాటాకు చప్పుళ్ళకు బెదరం

## మంత్రి మాటలపై నగర ఎమ్మెల్యే అనిల్ ధ్వజం



రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ మాటలపై నెల్లూరు నగర ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న తమను మంత్రి నోటికొచ్చినట్లు మాట్లాడడం మంచిది కాదన్నారు.

నెల్లూరులోని వైఎస్సార్సీపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ మంత్రి వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ఆయన మంత్రి కాదని జగత్‌కంత్రీ అని, మంత్రికి దమ్ముంటే ప్రజల వద్దకు వస్తే ఎవరు కంత్రీయో తెలుస్తుందని ఆయన సవాల్ విసిరారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలు తిరగబడే రోజులొస్తాయన్నారు. త్వరలోనే మంత్రి నారాయణ అవినీతి చిట్టా విప్పుతామని ఎమ్మెల్యే హెచ్చరించారు. తాము వ్యక్తిగతంగా ఏనాడూ మంత్రి నారాయణను విమర్శించలేదని, ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే, ఆ సమస్యలకు పరిష్కారం చూపాలని మాత్రమే తాము కోరామని, మంత్రి పదవిని చేపట్టి ఆరునెలలు దాటుతున్నా మంత్రి ఇంతవరకు నెల్లూరులో ఒక్క రూపాయి అభివృద్ధిపనులు చేపట్టిన దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. ఏదో హడావిడిగా సమావేశాలు పెట్టి వెళ్ళిపోవడం తప్ప, మంత్రి చేసిందేమీ లేదన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని పలుసార్లు కోరినా ఒక్కసారి కూడా స్పందించకుండా నోటికొచ్చినట్లు మాట్లాడడం తగదని ఆయన అన్నారు. కన్నింగ్ రాజకీయాలు ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసని, ఇరవై ఏళ్ళుగా ఆయన చేస్తున్న కన్నింగ్ రాజకీయాల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదని, ఇటీవల జరిగిన మేయర్, జడ్పీ ఎన్నికలు చూసినవారెవరికైనా కన్నింగ్ రాజకీయాలు ఎవరు చేస్తున్నారో తెలిసిపోతుందన్నారు. మంత్రి చేస్తున్న రాజకీయాలను చూసి టిడిపిలో వున్న వారు, ప్రజలు అందరూ ఏవగించుకుంటున్నారని ఆయన అన్నారు. నగర ప్రజలు నిత్యం తాగేందుకు మంచినీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే మంత్రి నారాయణ మాత్రం విదేశాల్లో తిరుగుతున్నారని ఆయన ఆరోపించారు. మంత్రి చేత గీతోపదేశం చేయించుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. మంత్రి తాటాకు చప్పుళ్ళకు, టిడిపి నాయకులు చేసే బెదిరింపులకు తామేమీ భయపడేది లేదన్నారు.



ఒకవైపే చూడండి... రెండోవైపు చూడాలనుకోకండి...

# తట్టుకోలేరు... మాడిపోతారు

## ప్రతిపక్ష నాయకులపై మంత్రి నారాయణ ఫైర్

సింహా సినిమాలోని "ఒక వైపే చూడు... రెండోవైపు చూడాలనుకోవద్దు... తట్టుకోలేరు.. మాడిపోతావ్..." అనే బాలకృష్ణ డైలాగు గుర్తొస్తుంది... ప్రతిపక్షనాయకులపైన మంత్రి పొంగూరు నారాయణ మండి పడ్డ వైనం చూస్తే! నేను కన్నింగ్ రాజకీయాలు చేస్తే తట్టుకోలేరని... ప్రతిపక్ష నాయకులారా ఖబడ్దార్... రెచ్చిపోయి మాట్లాడొద్దంటూ ఫైర్ అయ్యారు. ఎట్టకేలకు మంత్రి నారాయణ ప్రతిపక్షాల ఆరోపణలు, విమర్శలపై పెదవి విప్పారు.

సోమవారం నెల్లూరురూరల్ మండలం బుజబుజనెల్లూరు వద్ద ఏర్పాటు చేస్తున్న శిల్పారామం పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ గత 22ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, తెలుగుదేశం పార్టీతో, చంద్రబాబునాయుడుతో ఎంతో అనుబంధం ఉందన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతిరోజూ ఉదయం 6గంటల నుంచి రాత్రి 12గంటల వరకు పనిచేస్తున్నట్లు వివరించారు. విశాఖపట్నంలో తుఫాను బాధితులకు సకాలంలో అండగా నిలిచి ఆదుకున్నామన్నారు. నెల్లూరు బారాషాహిద్ రొట్టెల పండుగను ప్రజలు మెచ్చుకునేలా నిర్వహించామన్నారు. సమస్యలుంటే ప్రజావేదికల్లో చర్చించి అధికారుల దృష్టికి తీసుకెళ్ళాలని, తహశీల్దారు నుంచి కలెక్టర్ వరకు అధికారులున్నారన్నారు. లేదంటే నేరుగా తన దృష్టికి తీసుకొచ్చినా రోజుల్లోనే ఆయా సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. నెల్లూరు జిల్లాను ఎంతో అభివృద్ధి చేస్తామని, అందుకు కొంతసమయం కావాలన్నారు. ఆవేశపడి మాట్లాడకుండా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని ప్రతిపక్ష నేతలకు సూచించారు. తాను రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, 160కి పైగా మున్సిపాలిటీలకు మంత్రినన్న విషయం ప్రతిపక్షాలకు తెలియకపోవడం దారుణమన్నారు. మీరు కన్నింగ్ రాజకీయాలు మాని ప్రజల కోసం పనిచేయండి... కుదరదంటే నేనూ మీలా కన్నింగ్ రాజకీయాలు చేయాల్సి వస్తుందని... నేను కన్నింగ్ రాజకీయాలు చేస్తే మీరు తట్టుకోలేరని... మంత్రి నారాయణ ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.

# మూడోరూపం చూపండి!

## నారాయణ వ్యాఖ్యలపై కోటంరెడ్డి చురక



ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే ప్రతిపక్షాలు కన్నింగ్ రాజకీయాలు చేస్తున్నాయంటూ మున్సిపల్ మంత్రి పి.నారాయణ మాట్లాడడం నీచాతినీచంగా వుందని నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు.

మంగళవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంత్రిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. మంత్రి గారు... అతి ఆవేశం మనిషికి మంచిది కాదు, నేను మీ దగ్గర చదవు చెప్పించుకున్నాను. కాని రాజకీయ పాఠాలు మీ వద్ద చెప్పించుకునే స్థితిలో లేను. గురు దక్షిణగా రాజకీయ పాఠాలు నేనే మీకు చెబుతాను కావాలంటే రండి. మీ రెండోరూపాన్ని చూపిస్తే మేము తట్టుకోలేమన్నారు. మీ రెండో రూపాన్నే కాదు, మూడోరూపాన్ని కూడా ఇప్పుడే చూపించండి. మేము సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సమస్యను ప్రశ్నిస్తే కన్నింగ్ రాజకీయమంటారా? ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారులకు ఎప్పుడిస్తారని అడిగాం, నెల్లూరు నగర మాస్టర్‌ప్లాన్ అవకతవకలను సరిచేయమని కోరాం. ప్రజాసమస్యల గురించి మేం అడుగుతుంటే మావి కన్నింగ్ రాజకీయాలంటారా? కన్నింగ్ రాజకీయమంటే మీది. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు తన ఆస్తులను కూడా అమ్ముకుని పార్టీ కోసం పనిచేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని తొక్కేసి మీరు మంత్రి కావడం కన్నింగ్. పార్టీ కోసం కోట్లు ధారబోసిన బీద సోదరులను, తెలుగుదేశంపార్టీ ఆవిర్భావకర్తలలో ఒకడైన టి.రమేష్‌రెడ్డిని, పార్టీ కోసం గుండె పగిలేలా పనిచేసి ఆసుపత్రిపాలైన కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని కాదని మీరు మంత్రి కావడం కన్నింగ్. పార్టీ కోసం పనిచేసిన వాళ్లను పక్కకునెట్టేసి ఎన్టీఆర్, చంద్రబాబు, బాలకృష్ణ ఫ్లెక్సీలను తగలబెట్టిన నాయకులను ఇప్పుడు మీరు పక్కన తిప్పుకుంటున్నారే... అదీ కన్నింగ్. మీరు ఎన్నికల్లో పోటీచేయకుండానే మంత్రి అయ్యారు కాబట్టి ప్రజల సమస్యలు తెలియవు. మేము రాజకీయాలు మొదలుపెట్టిందే ప్రజల మధ్య కాబట్టి వారి కష్టనష్టాలు మాకు తెలుస్తాయి. కాబట్టే ప్రజాసమస్యల మీద నిరంతరం పోరాడుతుంటామని, చేతనైతే ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు తమతో కలిసిరావాలని ఆయన మంత్రికి పిలుపునిచ్చారు.

# అనిల్‌రెడ్డికి మరో ప్రతిష్టాత్మక అవార్డు



నెల్లూరు జిల్లా మినగల్లు గ్రామ నివాసి అయిన కాకటూరు అనిల్‌కుమార్ రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఈనెల 16న ఉదయపూర్‌లో జరిగిన 43వ అఖిల భారత అట్టపెట్టెల ఉత్పత్తి దారుల సమాఖ్య (ఎఫ్‌సిబిఎం) వార్షిక సమావేశంలో అనిల్‌కుమార్‌రెడ్డికి ఎంతో ప్రతిష్టాత్మకమైన హర్లాల్కా అవార్డు లభించింది. ఈ సమావేశంలో ప్రపంచం నలుమూలల నుంచి 800మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మమతా గ్రూప్ అధినేత మహేంద్ర భాయిపటేల్ 2009 ఎఫ్‌సిబిఎం అధ్యక్షులు అయిన అనిల్‌కుమార్‌రెడ్డికి ఈ పరిశ్రమకు విశిష్ట సేవలందించినందుకు గాను ఈ ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అట్టపెట్టెల ఉత్పత్తిలో విభిన్నమైన అభివృద్ధి, మెరుగుదల తెచ్చిన వారికి బహూకరించే విశిష్టమైన అవార్డు ఇది. అనిల్ కుమార్‌రెడ్డి ప్రస్తుతం చెన్నైలో నీలాద్రి ప్యాకేజింగ్ అనే అట్టపెట్టెల ఉత్పత్తి పరిశ్రమను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నారు. సమాఖ్యకు ఆయన అధ్యక్షులుగా వున్నప్పుడు సమాఖ్య సభ్యుల సంఖ్యను సుమారు 25శాతం పెంచారు. దేశంలోని అన్ని ప్రాంతీయ సంఘా లను సందర్శించి, సభ్యులందరితో వ్యక్తిగతంగా మాట్లాడిన అధ్యక్షులు కూడా ఈయన ఒక్కరే కావడం విశేషం. అట్టపెట్టెల తయారీలో ఫ్లెక్సోప్రింటింగ్ విధానం, శివకాశి టపాకాయల పరిశ్రమలో చెక్కపెట్టె స్థానంలో అట్టపెట్టెల వాడకం, అట్టపెట్టెల ఉత్పత్తి సుంకం తగ్గింపు వంటివి ఆయన ఈ పరిశ్రమలో సాధించారు. గతంలో చెన్నైలోని దక్షిణ భారత అట్టపెట్టెల ఉత్పత్తి దారుల సంఘం(ఎస్ఐసిబిఎంఎ) అధ్యక్షునిగా, భారత ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ జనరల్‌బాడీ మెంబర్‌గా వున్నారు. అంతర్జాతీయ అట్టపెట్టెల సంఘం (అమెరికా) వారికి వీరొక్కరే భారత దేశ ప్రతినిధి కూడా.

# సామూహిక ఆండాళ్ గోష్టి గానం



ధనుర్మాసం సందర్భంగా ఈనెల 19వతేది సాయంత్రం 6 నుంచి 8 గంటల దాకా నెల్లూరులోని శ్రీ రంగనాయకుల స్వామి దేవాలయంలో ఆండాళ్ అమ్మవారి సన్నిధి ప్రాంగణంలో భజనా మండళ్ళ మహిళలచే గోదాదేవి అనుగ్రహించిన తిరుప్పావైలోని 30 పాశురాలను 30 తెలుగు కీర్తనలుగా సామూహికగానం చేస్తారని శ్రీరంగనాథస్వామి దేవస్థానం పూలంగి కమిటీ సభ్యులు తెలిపారు. ఆధ్యాత్మిక సంగీత గురువు, శ్రీహరి వేంకట అన్నమాచార్యుల బిరుదాంకితులైన గుండాల గురవయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, భక్తులంతా విచ్చేసి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ప్రతి ఆదివారం పూలంగి కమిటీ వారిచే స్వామివారికి పూలంగి సేవ నిర్వహిస్తామని, పూలంగిసేవలో స్వామివారిని దర్శించుకుని తరించాలని వారు విజ్ఞప్తి చేశారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




## 'ప్రభా'తం

ఉగ్రవాద పెనుభూతం మరోసారి తన వికృతరూపం చూపింది. అంతులేని పైశాచికత్వంతో పేట్రేగిపోయి..అభం శుభం తెలియని చిన్నారులను నిర్దాక్షిణ్యంగా తుపాకీ తూటాలకు బలిచేసి..వారి నిండుప్రాణాలను పొట్టనబెట్టుకుని వికటాట్టహాసం చేసింది. ప్రశాంతంగా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులపై ఒక్కసారిగా విరుచుకుపడి.. 132 మంది విద్యార్థులను కర్కశంగా కాల్చి, హతమార్చింది. ఉగ్ర రక్కసులు సాగించిన ఆ నరమేధం ప్రపంచం మొత్తాన్నీ కుదిపేసింది..తీవ్ర దిగ్భ్రమకు.. భయాందోళనలకు గురిచేసింది.. తలచుకుంటేనే గుండెలవిసిపోయే ఈ ఘోర విషాద సంఘటన ప్రపంచ ప్రజలందరి హృదయాలనూ కలచివేసింది.

పాకిస్తాన్‌లోని పెషావర్ సైనిక పాఠశాలలో తాలిబన్ ఉగ్రవాద ముష్కరులు ఈ నెల 16న భయంకర బీభత్సం సృష్టించారు. ఏమాత్రం దయాదాక్షిణ్యాలు కానీ, కనీస మానవత్వం కానీ ఇసుమంత కూడా లేక..నిలువెల్లా రాక్షసత్వంతో, క్రూరమైన కిరాతకత్వంతో నిండిన తాలిబన్ ఉగ్రవాదోన్మాదులు ఏడుగురు ఆత్మాహుతిదళంగా ఏర్పడి ఈ దారుణానికి ఒడిగట్టారు. పాకిస్తాన్‌లోని పెషావర్ సైనిక పాఠశాలలోకి సైనిక దుస్తుల్లో వచ్చిన దుండగులు ఆడిటోరియం ద్వారా లోపలకు ప్రవేశించారు. ప్రతి తరగతి గదినీ చుట్టుముట్టి తూటాల వర్షం కురిపించారు. విద్యార్థులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా సాగించిన కాల్పులను.. ఆ దారుణ మారణకాండను వివరించేందుకు మాటలు చాలవు. అభంశుభం తెలియని విద్యార్థులపై ఉగ్రవాదులు తుపాకులు ఎక్కుబెట్టారు. ఎక్కడివారినక్కడ మట్టుబెట్టారు. తరగతి గదుల్లో చదువుకుంటున్న బాలలను అక్కడికక్కడే తుపాకీ గుళ్ళకు బలిచేశారు. తమ రాక్షసప్రవృత్తితో 132మంది విద్యార్థులను పొట్టన బెట్టుకున్నారు. ఈ దారుణ ఉదంతం విని ప్రపంచం యావత్తూ నిర్ఘాంతపోయింది. తాలిబన్ ఉగ్రవాద రక్కసుల కరకు కోరలకు ఈ సంఘటనలో మొత్తం 141 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, అందులో 132 మంది పాఠశాల చిన్నారులు వున్నారు. అన్నెం పున్నెం ఎరుగని ఎంతోమంది విద్యార్థుల ప్రాణాలను హరించి, ఆ పసిబిడ్డల తల్లులకు గర్భశోకాన్ని, వారి కుటుంబాలకు తీరని విషాదాన్నీ మిగిల్చారు. మానవత్వానికే మాయని మచ్చగా..పైశాచికత్వానికి పరాకాష్టగా జరిగిన ఈ రాక్షసకాండకి.. ఈ ఉగ్రవాద రాక్షసక్రీడకి ప్రపంచమే తల్లడిల్లిపోయింది. అన్ని దేశాల్లోని ప్రజలు ఈ విషాదానికి చలించి పోయారు. మీడియాలో, వార్తాకథనాల్లో ఆ విషాదదృశ్యాలను చూసినవారెవరికైనా గుండె తరుక్కుపోతుంది. ఈ ఉగ్ర ఘాతుకం..మానవ చరిత్రకే మచ్చ తెచ్చే మారణహోమంగా నిలిచిపోయింది.

పాఠశాల గదుల్లోకి జొరబడిన ఉగ్రవాదులు, తరగతి గదుల్లో చదువుకుంటున్న విద్యార్థులను చుట్టుముట్టి కనిపించినవారిని కనిపించినట్లు, పిట్టల్ని కాల్చినట్లు కాల్చిచంపారు. బడి పిల్లలని కూడా చూడకుండా బుల్లెట్లు పేల్చారు.తరగతి గదులన్నీ వెతికి వెతికి విద్యార్థులను హతమార్చారు. రాక్షసమూకగా వచ్చిన ఆ ఉగ్రోన్మాదులకు చిక్కిన ఆ విద్యార్థులు తమనంతా అలా కాల్చి చంపుతుంటే.. ఆ భయంకర సమయంలో ఎంత భయంతో విలవిలలాడిపోయారో!!.. ప్రాణభయంతో వారెంతగా ఆర్తనాదాలు చేసివుంటారో!..తలచుకుంటేనే ప్రతి ఒక్కరి హృదయం బాధతో తల్లడిల్లిపోతుంది. ఇంతకంటే కిరాతకం.. ఘోర పాతకం ఇంకేమైనా వుంటుందా?..అయినా, పగలు ప్రతీకారాలూ తీర్చుకునేది పసివారిపైనా?.. ఇంత దారుణం ఎక్కడైనా వుంటుందా!... అంటూ సభ్యసమాజం తల్లడిల్లిపోయింది. ఈ ఘటనలో విద్యార్థులతో పాటు, మరో 9 మంది పాఠశాల సిబ్బంది కూడా మృతిచెందారు. మరో 130 మంది విద్యార్థులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఇంత ఘోరమైన, పాశవికమైన ఉగ్రవాదుల దుశ్చర్యలను ప్రపంచమంతా నిరసించింది. పాఠశాలలో ఉగ్రవాదుల ఘటన సమాచారం అందడంతోనే పాక్ సైనికులు అక్కడికి వచ్చి విద్యార్థులను రక్షించేందుకు ఆ ఉగ్రవాదులపై ఎదురుదాడి చేశారు. అనేకమంది విద్యార్థులను రక్షించారు. దాదాపు 8 గంటలపాటు సాగిన ఈ దాడుల్లో ఉగ్రవాదులు కొందరు తమకు తామే పేల్చేసు కోగా, మిగిలినవారిని పాక్ సైనికదళాలు మట్టుబెట్టాయి. ఉత్తర వజీరిస్థాన్‌లో పాక్ సైనిక చర్యకు ప్రతీకారంగా ఈ దాడులకు పాల్పడినట్లు తాలిబన్ ప్రకటించుకుంది. కాగా, ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదసంస్థ ఇటీవలికాలంలో బలంగా ఎదగడానికి, ఆఫ్ఘనిస్తాన్‌లో పాలనలోకి రావడానికి గతంలో పాకిస్తాన్ తోడ్పాటునివ్వడం, ఆ తర్వాత అధికారం కోల్పోయిన తాలిబన్ ఇప్పుడు పాక్ గడ్డమీదనే ఉత్తర వజీరిస్తాన్‌ను కేంద్రంగా చేసుకుని, పాక్‌పై కూడా దాడులు సాగిస్తుండడంతో, అందుకు ఆగ్రహించిన పాక్, తాలిబన్‌లను ఏరివేసేందుకు సైనికచర్య ప్రారంభించింది. అయితే, పాలుబోసిన చేతినే కాటేసే పాములాగా ఉగ్రవాద విషసర్పం చివరికి పాక్‌నే కాటేయడంతో పాక్ విషాదంలో పడింది. పెషావర్ స్కూల్ సంఘటన పాక్‌కు తీరని శోకాన్ని మిగిల్చింది. ఇదిలావుంటే, పెషావర్ ఘటనను జాతీయ విషాదంగా పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఇది పిరికిపందల చర్య అని, ఉగ్రవాదంపై పోరుకు దేశమంతా ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తర వజీరిస్తాన్‌లోని గిరిజనప్రాంతాల్లో ఉగ్రవాదుల ఏరివేతకు చేపట్టిన సైనిక చర్యను కొనసాగించి తీరుతామని ఆయన అన్నారు. ఏదేమైనా, ఉగ్రవాదం విషసర్పం లాంటిదే. అది ఏ రూపంలో వున్నా దానిని ఎదుర్కోవాల్సిందే. సమూలంగా దానిని నిర్మూలించాల్సిందే. ఉగ్రవాదంపై పోరుకు అన్ని దేశాలూ, ప్రజలూ అందరూ సమాయత్తం కావాల్సిందే. లేదంటే ఇలాంటి దారుణాలు, మారణహోమాలు తప్పవని పెషావర్ స్కూల్ ఘటనలు చెప్పకనే చెప్తున్నాయి. మన ప్రధాని నరేంద్రమోడీ కూడా తన విదేశీ పర్యటనల్లో ఎక్కడకు వెళ్లినా, ఉగ్రవాదంపై పోరు సాగించాలని, ఉగ్రవాదాన్ని అందరం కలిసి ఎదుర్కోవాలని, ఉగ్రవాదంపై పోరు సాగించేందుకు అన్ని దేశాలూ సమాయత్తం కావాలని, ఉగ్రవాదం ఏ రూపంలో వున్నా దానిని అరికట్టాలని పదేపదే తన ప్రసంగాల్లో ప్రబోధిస్తూనే వున్నారు. కాగా, పెషావర్ ఘటన పట్ల ప్రధాని మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అంతేకాదు, ఉగ్రవాదంపై సాగించే పోరులో భారత్ పాకిస్తాన్ వెంట దృఢంగా నిలబడుతుందని ఆయన స్పష్టం చేయడం, పాక్‌కు సంఘీభావంగా దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ రెండు నిమిషాలు మౌనం పాటించాలని ఆదేశించడం ఈ సమయంలో ఎంతో సందర్భోచితం.. సముచితం కూడా!

### 'ఉగ్ర'రాక్షసం



*పాకిస్తాన్‌లోని పెషావర్ స్కూల్‌లో 132 మంది విద్యార్థులను తాలిబన్ ఉగ్రవాదులు హతమార్చడం దారుణం. ఘోరాతిఘోరం. ఉగ్రవాదం విషసర్పం లాంటిది. అది ఏ రూపంలో వున్నా దానిని ఎదుర్కోవాల్సిందే. సమూలంగా దానిని నిర్మూలించాల్సిందే. ఉగ్రవాదంపై పోరుకు ఇకనైనా అన్ని దేశాలూ, ప్రజలూ అందరూ సమాయత్తం కావాల్సిందే. లేదంటే ఇలాంటి దారుణాలు, మారణహోమాలు తప్పవని పెషావర్ ఘటనలు చెప్పకనే చెప్తున్నాయి.*

## అనుమతి లేని హేచరీలు సీజ్

అనుమతి లేకుండా అనధికారికంగా నడుపుతున్న నకిలీ వెనామీ రొయ్యలను ఉత్పత్తి చేస్తున్న హేచరీలపై జిల్లా యంత్రాంగం కొరడా ఝళిపించింది. చెన్నైకు చెందిన కోస్టల్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఫిర్యాదుతో నెల్లూరుజిల్లా కలెక్టర్ జానకి ఆదేశాల మేరకు 12వ తేదీ మత్స్యశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. జిల్లాలో తీరం వెంబడి కోస్టల్ అథారిటీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా హేచరీలు నడుపుతున్నారని జిల్లా మత్స్యశాఖ జెడి బలరాం తెలిపారు. నెల్లూరుజిల్లాలోని వాకాడు తూపిలిపాళెంలోని శాంతి, వినాయక, బాలాజీ హేచరీలను, ఇందుకూరుపేట మండలం మైపాడులోని మూన్‌హేచరీ, విడవలూరు మండలం వరిణి గ్రామంలోని శ్రీ హేచరీలపై దాడులు చేసి తాళాలు వేసినట్లు జేడి తెలిపారు.

## పోలీసుల పనితీరుపై డిఎస్పీ ఆగ్రహం

నెల్లూరుజిల్లా సంగంలో పోలీసుల పనితీరుపై నెల్లూరు రూరల్ డిఎస్పీ రాంబాబు అసహనం వ్యక్తం చేశారు. 12వ తేదీ సంగం పోలీసుస్టేషన్లో డిఎస్పీ వార్షిక తనిఖీ చేశారు. సంగంలో కాపురం లేకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని సిబ్బందిని మందలించారు. సంగంలో నివాసం లేని వారి వివరాలను తనకు ఇవ్వాలని, వారికి హెచ్ఆర్‌ఏ లేకుండా చేస్తానన్నారు. నెల్లూరురూరల్ డివిజన్ పరిధిలోని 13పోలీసుస్టేషన్లలో అత్యధికంగా పెండింగు కేసులు ఈ స్టేషన్‌లో ఉండటం దారుణమన్నారు.

సంగం పోలీసుస్టేషన్ బోర్డు దుస్థితిని పరిశీలిస్తేనే ఇక్కడి సిబ్బంది పనితీరు ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవు తోందన్నారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకుని సక్రమంగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. సంగం ఎస్సై విజయకుమార్ ఆయన వెంట ఉన్నారు.

## అధికారం కోసం అబద్ధాలు

### - ముఖ్యమంత్రిపై వైయస్సార్సీపీ నేతల ధ్వజం

రైతులకు రుణాలు మాఫీ చేయలేమని తెలిసి కూడా అధికారం కోసం నారా చంద్రబాబునాయుడు అబద్ధాలు చెప్పారని తిరుపతి ఎంపి వెలగపల్లి వరప్రసాద్ ఆరోపించారు. ఆదివారం నెల్లూరు నగరంలోని వైయస్సార్సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా చేనేత కార్మికులు ఉన్నారని, ప్రభుత్వం వారి గోడు పట్టించుకోవడం లేదన్నారు. నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రైతు రుణాలకు సంబంధించి వడ్డీని మాత్రమే భరించాలన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులను నిలువునా మోసం చేసినవారు ఎవరైనా ఉన్నారంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనన్నారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ పథకం గోల్‌మాల్ పథకంగా మారిందన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు బెల్టుషాపులు ఎక్కడా లేకుండా చేస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు ఊరూరా బెల్టుషాపులు పెట్టించారన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, వైయస్సార్సీపీ జిల్లా అధికారప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ రూప్‌కుమార్‌యాదవ్, బిసి సెల్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




### పాక్‌కు బుద్ధొచ్చింది

పాముకు పాలు పోసి పెంచితే ఏమవుతుందనేది పాకిస్తాన్‌కు ఇప్పుడు బాగా అర్థమై వుంటుంది. ప్రపంచ దేశాలలో ఎక్కడ ఏ ఉగ్రదాడి జరిగినా దానికి వ్యూహరచన పాకిస్తాన్‌లోనే జరుగుతుందని ఎన్నో దేశాలు మొత్తుకున్నా తమకేమీ తెలియదని బుకాయిస్తూ వచ్చిన పాక్‌కు ఈరోజు పెషావర్ స్కూల్ పిల్లలపై ఉగ్రవాదుల దాడి ఒక మంచి గుణపాఠం నేర్పింది. ఇకనైనా పాకిస్తాన్ ప్రభుత్వం తాలిబన్లపై ఉక్కుపాదం మోపాలి.

- రామకృష్ణ, ఆత్మకూరు.

### పనిచేయని ఏటిఎంలు

వినియోగదారుల సౌకర్యార్థం వివిధ రకాల బ్యాంకులు ఏటిఎంలను ఏర్పాటు చేసాయి. అయితే ముఖ్యంగా ఎస్‌బిఐ వారు ఏర్పాటు చేసిన ఏటిఎంలు అత్యధికంగా పని చేయడం లేదు. ఒకవేళ పని చేసినా అన్ని సర్వీసులు లభించడం లేదు. ముఖ్యంగా 100నోటు అనేదే ఆ బ్యాంకు ఏటిఎంలలో ఉండదం లేదు. ఏకంగా 'రూ.100లు లేవు' అని బోర్డులు కూడా పెట్టేస్తున్నారు. భారతదేశంలో ప్రథమ స్థానంలో నిలిచే ఎస్‌బిఐ దుస్థితి ఇది.

- కృష్ణ.జె.యస్., నెల్లూరు.

### నెల్లూరు రోడ్లు బాగుపడవా?

రాష్ట్రంలో నెల్లూరు నగరానికి చాలా మంచి పేరుంది. కాని ఇక్కడకొచ్చి చూస్తే నెల్లూరు నగరం ఇంత ఘోరంగా ఉంటుందా అనిపిస్తుంది. చినుకు రాలితే చాలు రోడ్లన్నీ గుంటలు పడిపోతున్నాయి. మన నాయకులు చేతివాటం కోసం ఉన్న మంచి రోడ్లపై నాసిరకం తారురోడ్లు వేసి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. మొన్న కురిసిన చిన్న వర్షానికే రోడ్లు గుంటలు పడ్డాయి, అధికారులు వాటికి మరమ్మత్తులు చేయాల్సి వుంది.

- జి.వి.యస్, నెల్లూరు.

### మత మార్పిడిలు

ఆగ్రాలో కొందరు ముస్లింలు హిందూ మతాన్ని స్వీకరించగానే మత మార్పిడిలను నిరోధించాలంటూ ప్రతిపక్షాలు గోల చేస్తున్నాయి. గత కొన్ని వందల ఏళ్ళుగా హిందూ మతస్థులను ప్రలోభాలు పెట్టి ఇతర మతాలలోకి చేరుస్తున్నప్పుడు వీళ్ళ గొంతులు ఏమయ్యాయి.

- సి.రాజీవి, నెల్లూరు.

# నెల్లూరు కబుర్లు

## ఛలో హైదరాబాద్

నెల్లూరుజిల్లా ప్రజాప్రతినిధులు లేక ఖాళీగా వుంది. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. దీంతో ఎంపీలు ఢిల్లీ వెళ్లారు. అలాగే 18వ తేదీ నుండి శీతాకాల అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యాయి. జిల్లాలోని 10మంది ఎమ్మెల్యేలతో పాటు ఇద్దరు ఎమ్మెల్సీలు కూడా హైదరాబాద్ వెళ్లడంతో నెల్లూరులో రాజకీయసందడి బాగా తగ్గింది.

## హిమాచల్‌ప్రదేశ్ విశ్రాంత చీఫ్‌జస్టిస్‌కి బార్ సన్మానం



నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ తేదీ విశ్రాంత చీఫ్ జస్టిస్ మాకాని నారాయణరావును సన్మానించారు. హిమాచల్‌ప్రదేశ్ చీఫ్‌జస్టిస్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ అనంతరం ప్రస్తుతం సుప్రీంకోర్టు సర్వోన్నత న్యాయస్థానంలో ప్రాక్టీసు చేస్తూ ముప్పై సంవత్సరాల తర్వాత నెల్లూరుకి వచ్చిన సందర్భంగా మాకాని నారాయణరావుని నెల్లూరు బార్ అసోసియేషన్ తరఫున సన్మానించారు. ఈ సందర్భంగా మాకాని నారాయణరావు మాట్లాడుతూ న్యాయవాదులు కష్టపడి పైకిరావాలని, న్యాయమూర్తులు జవాబుదారీతనంతో తీర్పు ఇవ్వాలని కోరారు.

# ఆశలన్నీ పదవుల చుట్టే!





**తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలయ్యింది. కాని తమ పార్టీయే అధికారంలో ఉందన్నమాటే గాని ఆ ఫీలింగ్ కార్యకర్తలకు లేకుండా పోయింది. అధికారంలో లేనప్పటికీ, ఉన్నప్పటికీ పెద్ద తేడా కనిపించడం లేదు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఇంతవరకు నామినేటెడ్ పదవుల జోలికి పోలేదు. గతంలో ప్రభుత్వం ఏర్పడ్డ నెలరోజుల్లోనే నామినేటెడ్ పదవుల ప్రక్రియను ముగించేవాళ్లు. ఇప్పుడు చంద్రబాబు సీఎం అయ్యింది మొదలు 'సింగపూర్ రాజధాని' మైకంలో పడ్డాడు. రాజధాని, ఋణమాఫీ వంటి అంశాలను మెడకు చుట్టుకుని కష్టపడుతున్నాడు. నామినేటెడ్ పదవుల జోలికి పోయే పరిస్థితి కూడా లేకుండాపోయింది.**

ఎల్లకాలం సాగదీస్తూ పోతే కార్యకర్తలలో అసంతృప్తి పెరిగిపోతుందని భావించిన చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పదవుల భర్తీకి ఈమధ్యే పచ్చ జెండా ఊపాడు. చంద్రబాబు నుండి సిగ్నల్ రావడంతో నెల్లూరుజిల్లాలోని తెలుగు తమ్ముళ్ల ఆశలన్నీ నామినేటెడ్ పదవుల చుట్టూనే తిరుగుతున్నాయి. జిల్లాలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఏర్పాటు కానుంది. 33మండలాల పరిధిలో 'నుడా' ఏర్పాటు చేస్తుండడంతో ఈ సంస్థ ఛైర్మెన్ పదవి కోసం పెద్దఎత్తున పోటీ నెలకొంటుంది. జిల్లా స్థాయి నాయకులు ఈ పదవి కోసం రేసులో నిలుస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిలిపేసిన ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్ పదవికి ఈసారి ఇచ్చే అవకాశాలున్నాయి. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ పదవిని భర్తీ చేయాల్సివుంది. జిల్లాలో దేవాదాయ పాలక కమిటీలతో పెద్దఎత్తున పదవులు వున్నాయి. పెద్ద చిన్న దేవాలయ కమిటీలు వందలోనే ఉన్నాయి. వీటిలో శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం, నరసింహకొండ దేవస్థానం, పెంచలకోన దేవాలయం, సూళ్లూరుపేట చెంగాళమ్మ దేవస్థానం, జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయం, నెల్లూరు రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, మూలాపేట శివాలయం, బిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం వంటి ఆలయాలకు కమిటీలు వేయాల్సివుంది. ఈ కమిటీలలో ఛైర్మెన్‌లు, సభ్యుల పదవులకు తెలుగు తమ్ముళ్లు దరఖాస్తులు కూడా ఇచ్చుకుంటున్నారు. జిల్లాలో కావలి, కోవూరు, ఉదయగిరి, రాపూరు, ఆత్మకూరు, వాకాడు, గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట వంటి వ్యవసాయ సహకార సంఘాలకు కమిటీలు వేయాల్సివుంది. వీటి ద్వారా కొంతమంది తమ్ముళ్లను సంతృప్తి పరిచే అవకాశముంది.

ఇవే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా ఛైర్మెన్‌లు, వివిధ సంస్థలలో డైరెక్టర్ల వంటి పదవులకు నెల్లూరు తమ్ముళ్లు టెండర్లు పెడుతున్నారు.

# త్వరలోనే కొత్త రాజధాని

**- స్పీకర్ కోడెల శివప్రసాద్**



రాష్ట్ర అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారని, త్వరలోనే కొత్త రాజధాని కూడా ఏర్పాటవుతుందని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్ అన్నారు.

ఒక వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు స్పీకర్ ఈ నెల 12న నెల్లూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా అల్లీపురంకు వెళ్ళి, ఆయనకు అత్యంత సన్నిహితుడైన మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇంట్లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం స్పీకర్ విలేకరులతో మాట్లాడుతూ, సోమిరెడ్డి తనకు మంచి మిత్రుడని అన్నారు. ప్రజాసమస్యలపై సోమిరెడ్డికి ఎంతో అవగాహన వుందని, అనేక అంశాలపై పూర్తిస్థాయిలో పట్టు వున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇప్పుడు అసెంబ్లీలో లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. సోమిరెడ్డితో తనకు మంచి సంబంధాలు న్నాయన్నారు. నెల్లూరుతో తనకెంతో అనుబంధం వుందన్నారు.

ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ పల్నాటి రాజకీయలను శాసించిన కోడెల శివప్రసాద్ గతంలో పలు శాఖలకు మంత్రిగా వున్నారని, ఆయన ఏ పదవిలో వున్నా ఆ పదవులకే వన్నె తెచ్చారని అన్నారు. తానెప్పుడూ ఆయన్ను ఆత్మీయంగా అన్నా అని పిలుస్తుంటానని, తామిద్దరం కలసి అనేకసార్లు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్నామని తన జ్ఞాపకాలను వివరించారు.

కాగా, సోమిరెడ్డి నివాసానికి విచ్చేసిన స్పీకర్‌ను తొలుత జేసి రేఖారాణి, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్ శివప్రసాద్ తదితరులు కలసి పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.

టిడిపి నాయకులు బీదా రవిచంద్ర, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెంకట గిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ముంగ మూరు శ్రీధరకృష్ణారెడ్డి, పరసా వెంకటరత్నం, కంభం విజయ రామిరెడ్డి, నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, గూటూరు కన్న బాబు, తాళ్లపాక అనూరాధ, అంచెల వాణి, నువ్వుల మంజుల, నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు స్పీకర్‌ను కలిశారు.

## బలరామయ్యకు మహాత్మాగాంధీ ఫెలోషిప్



వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ డిసెంబర్ 12, 13తేదీలలో విజయనగరంలోని నాయుడు ఫంక్షన్‌హాల్లో జరిగింది. ఈ కార్యక్రమాలకు వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పి.వి.వి. రాజు, 2015 ప్రెసిడెంటు డా॥ ఇ.జయంతి రావు, 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ నేతాజీ ఎం.వి.సుబ్బారెడ్డి, ఇతర జిల్లాల నుండి సుమారు 800మంది వాకర్సు హాజరయి, ప్రముఖులు వాకింగ్, ఆరోగ్యం మీద ప్రసంగించారు.

ఈ సందర్భంగా నలుబోలు బలరామయ్యనాయుడును అప్రిసియేషన్ అవార్డు ఛైర్‌పర్సన్ డిస్ట్రిక్ట్ 203 మరియు ఎంజిఎఫ్ మహాత్మాగాంధీ ఫెలోషిప్ బిరుదుతో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పి.వి.పి.రాజు, ఇన్‌కమింగ్ ప్రెసిడెంట్ డా॥ ఇ.జయంతిరావులు సత్కరించారు.

## సుబ్బారెడ్డికి బెస్ట్ గవర్నర్ అవార్డ్



వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-203 బెస్ట్ గవర్నర్‌గా నేతాజీ సుబ్బారెడ్డి ఎంపికై అవార్డును తీసుకోవడం జరిగింది. విజయనగరంలో జరిగిన 23వ ఇంటర్నేషనల్ వాకర్స్ కన్వెన్షన్‌లో వాకర్స్ అధ్యక్షులు పి.వి.పి.రాజు, మాజీఅధ్యక్షులు నాగభూషణం, డా॥ ఎం.వి.రావు, కృష్ణారావు, 2015 అధ్యక్షులు డా॥ ఇ.జయంతిరావుల చేతులమీదుగా ఈ అవార్డు తీసుకున్నారు.

## జాతీయ కరాటే పోటీల్లో రత్నం విద్యార్థుల ప్రతిభ



డిసెంబర్ 13, 14తేదీల్లో తమిళనాడులోని తిరవళ్ళూరు జిల్లా గుమ్మిడిపూడిలో టి.జి.భాస్కర్ మెమోరియల్ వారు నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఆంధ్ర నుండి కొందరు విద్యార్థులు పాల్గొనగా నెల్లూరు సరస్వతి నగర్‌లోని డా॥ కిషోర్ రత్నం ఒలింపియాడ్ బ్యాచ్ నుండి కలర్‌బెల్ట్ విభాగంలో అండర్-12 జి.వి.యస్.చరిత్, అండర్-13లో కె.సాయిశివలు పాల్గొని బ్రాంజ్ పతకం మరియు ప్రశంసాపత్రాలు సాధించారు. ఈ సందర్భంగా రత్నం ఒలింపియాడ్ బ్యాచ్ ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో జాతీయస్థాయిలో రాణించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.వి.డి. మనోజ్‌కుమార్ పుష్పగుచ్ఛంతో అభినందించారు.

## ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ జోక్యం తగదు

ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ నాయకుల జోక్యం తగదని గెజిటెడ్ ఆఫీసర్ల జిల్లా అదహక్ కమిటి ఛైర్మెన్ సిహెచ్ రవీంద్రబాబు అన్నారు. ఆదివారం నెల్లూరు ఇండియన్ మెడికల్ హాల్లో జరిగిన కార్యక్రమంలో రవీంద్రబాబు మాట్లాడుతూ ఉద్యోగులను చిన్నచూపు చూస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుతామని హెచ్చరించారు. మంత్రి, అధికారపార్టీ నాయకుల సిఫార్సులకు నిస్సిగ్గుగా తలొంచి బదిలీలు చేయడం దారుణమన్నారు.

## ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ల సంఘం ఎన్నికలు

నెల్లూరులోని గోల్డెన్‌జూబ్లీహాల్‌లో ఈనెల 13న జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ల సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ సంఘానికి అధ్యక్షులుగా సిహెచ్ శ్రీనివాసులు ఎన్నికయ్యారు. అదేవిధంగా, ఉపాధ్యక్షులుగా నాయక్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ హజరత్, కోశాధికారిగా మాలిని ఎన్నికయ్యారు. టెక్నికల్ కార్యదర్శిగా ప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా జిలానీబాషా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



# ‘తానా’ పండుగ

(మొదటిపేజీ తరువాయి)

రవ్వా శ్రీహరికి అందజేశారు. అలాగే ఈ కార్యక్రమ రూపశిల్పి శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డిని ఆయన తండ్రిని ‘తానా’ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అలాగే నరసింహమూర్తి స్మారక పురస్కారాన్ని జానపద కళాకారుడు గొర్రెల రాములుకు అందజేశారు. సాహిత్య, పాత్రికేయ, రైతు రంగాలలో విశేషంగా కృషి చేసి ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆర్థిక పురస్కారాలను అందజేశారు. చాలా తక్కువకాలంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అమెరికాలో జరిగే తానా సభలకంటే దిగ్విజయం చేసిన ఈ వేడుకల కమిటి ముఖ్యసమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డికి ఇతర కమిటి సభ్యులకు తానా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అతిథులను, తానా ప్రతినిధులను, కమిటి సభ్యులను రవిసన్నారెడ్డి జ్ఞాపికలతో సత్కరించారు.

నెల్లూరీయుల ముంగిళ్ళలో తెలుగు సంస్కృతి సంప్రదాయాల వేదికగా నిర్వహించిన ఈ చైతన్య స్రవంతి మహోత్సవం ఉదయం 9గంటలకు ప్రారంభమైంది. నెల్లూరు జిల్లాలోని ప్రజలు, ప్రముఖులు, కళాకారులు, కవులు, కళాభిమానులంతా పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలిరావడంతో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ కళకళలాడింది. ప్రారంభోత్సవ సభ అనంతరం మా తెలుగు తల్లికీ మల్లెపూదండ..గీతంతో ప్రారంభమైన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో దేశభక్తి నృత్యాలు, జానపద నృత్యాలు, స్మైల్ డాన్స్, తెలుగు పద్యాలు, వీణానాదం అలరించాయి. అనంతరం సాయి హేమంత కృష్ణ నాశికా వేణుగానం, సుప్రసిద్ధ గాయనీమణి శ్రీమతి బాలార్క ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. డప్పు నృత్యాలు, లంబాడీ నృత్యాలు, విద్యాధరి బృందంవారిచే నిర్వహించిన ‘మహిషాసుర మర్ధిని’ నృత్య రూపకం, యోగా, సినీ జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. నెమలి డాన్స్, తెలుగు వెలుగు నృత్య రూపకం, ప్రగతి ఛారిటీస్ విద్యార్థులచే సినీ నృత్యం, వసుంధర శాస్త్రీయ నృత్యం, కీలు గుర్రాల బృందంవారి నృత్యాలు, శ్రీ రామాంజనేయ యుద్ధ సీను, శివ పార్వతుల నృత్యం, జోష్ణవి యోగా విన్యాసాలు, తప్పెట్ల విన్యాసాలు, శివతాండవం, అభిషేక్ బృందం జానపద నృత్యం, ప్రముఖ కవులు చిన్ని నారాయణరావు, ఈదూరు సుధాకర్, పాతూరి అన్నపూర్ణ, ఈతకోట సుబ్బారావు, అన్నపూర్ణా సుబ్రహ్మణ్యం, బొగ్గవరపు రాధాకృష్ణల హాస్య కవితలు అందరినీ అలరించాయి. దీపాలతో గురుకృప చిన్నారులు ప్రదర్శించిన స్వాగత నృత్యం అందరినీ అబ్బురపరచింది.

ఇక సాయంత్రం సమయంలో గాయకులు శ్రీకృష్ణ, నెల్లూరు ప్రవీణ్, లిప్సికలు మృధు మధురంగా పాడిన ఆపాత మధురాలు, జబర్దస్త్ ఫేమ్స్ చంటి, సుధాకర్ బృందం చేసిన కామెడీ స్కిట్స్, చివరగా జబర్దస్త్ సుధాకర్ ప్రముఖ హీరోలను అనుకరిస్తూ చేసిన గాలిపటం డ్యాన్స్ ఆహూతులను కడుపుబ్బా నవ్వించింది. ప్రముఖ టీవీ యాంకర్ చిత్రలేఖ వ్యాఖ్యానం కార్యక్రమానికి ఎంతో నిండుదనం తెచ్చింది.

శ్రీ సిటి ఛైర్మెన్ సన్నారెడ్డి రవిరెడ్డి సారథ్యంలో ‘లాయర్’ వారపత్రిక నిర్వాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వాహక కమిటీలలో సభ్యులైన బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, వాకాటి విజయకుమార్‌రెడ్డి, రావి మోహన్‌చౌదరి, డా॥ కె.కృష్ణకిషోర్, నలుబోలు బలరామయ్య నాయుడు, బి.మనోహర్‌రెడ్డి, డి.హేమంత్‌కుమార్, సిహెచ్.మురళి, వి.చంద్రయ్యచౌదరి, ఎన్.కృష్ణ మోహన్, టివియస్ చలపతిరావు, ఎం.శోభన్‌రెడ్డి, వంశీధర్, ఆర్.బాలిరెడ్డి, కనుపూరు శ్రీనివాసులురెడ్డి, బి.కృష్ణారెడ్డి, వి.శ్రీధర్‌రెడ్డి, కె.విజయకుమార్, ఎస్.వి.ఆర్.సురేష్, జి.వి.శర్మ, బెనర్జీ, ఎన్.చందు, కె.రమేష్, యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్, దాసరి రవికుమార్‌రెడ్డి, సివి శరణ్‌కుమార్, వి.సురేష్, ఎన్.వంశీకృష్ణ తదితరులు ఈ కార్యక్రమ బాధ్యతలు నిర్వహించారు.

ఉదయం నుండీ రాత్రి వరకు జరిగిన అన్ని సాంస్కృతిక కార్యక్రమాలను కళాంజలి అనంత్ పర్యవేక్షణలో జి.వి.శర్మ సహకారంతో స్వప్నారెడ్డి యాంకరింగ్‌తో 12గంటల పాటు నిర్విరామంగా సాగడం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

**స్టాల్స్ వద్ద సందడే సందడి...** మన సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి, భావితరాలకు అందించాలనే సత్సంకల్పంతో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ కళాప్రదర్శనల స్టాల్స్ ప్రేక్షకులను ముఖ్యంగా అమెరికా నుండి విచ్చేసిన తానా ప్రతినిధులను అబ్బుర పరిచాయి. పల్లెసీమలలో కూడా కనుమరుగైపోతున్న ఎన్నో ప్రాచీన కళా ప్రదర్శనలను ఇక్కడ స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. తప్పెట్లు, డప్పు, కోలాటం, పండరిభజన, పులివేషాలు, కర్రసాము, కీలుగుర్రాలు, నెమలినృత్యం, బొంగరాలు, బిళ్లంగోడు, గంగిరెద్దులు, వెదురుబుట్టల అల్లకం, ఆర్ట్‌గ్యాలరీ, ప్రాచీన నాణేలు, నోట్లు వంటి స్టాల్స్ ప్రేక్షకులను ఆకర్షించాయి. ముఖ్యంగా తప్పెట్లు, కోలాటం, గంగిరెద్దుల ప్రదర్శనలను విద్యార్థులతో పాటు తానా ప్రతినిధులు కూడా బాగా ఎంజాయ్‌చేశారు. విద్యార్థులైతే తప్పెట్లకు మంచి దరువులేసి ఆనందించారు. ఎక్కువ సంఖ్యలో పాఠశాలల కరస్పాండెంట్లు కార్యక్రమంపై ఆసక్తి చూపించి ప్రత్యేకశ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.





# కళ్యాణ వైభవం...!



నెల్లూరు ట్రంకురోడ్డు షిరిడి సాయిబాబా మందిరం కమిటి చైర్మెన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి - అనితల కుమార్తె **వైష్ణవి - విక్రాంత్‌రెడ్డి** (చెన్నై వాస్తవ్యులు చింతాల శ్రీరామచంద్రారెడ్డి - బృందల కుమారుడు)ల పరిణయం డిసెంబర్ 7వ తేదీ నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.



ఎన్ టివి ఇన్‌పుట్ ఎడిటర్ అన్నమనేని శ్రీరామ్ - రత్నకుమారిల కుమార్తె **దివ్య - రవికిరణ్** (విజయవాడ వాస్తవ్యులు దొడ్డపనేని రామారావు - క్షీరాబ్ధిల కుమారుడు)ల వివాహం డిసెంబర్ 5వ తేదీ హైదరాబాద్‌లోని ఎన్ గార్డెన్స్ నందు ఘనంగా జరిగింది. కొత్తదంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.



గూడూరు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డి - శారదల కుమార్తె **ప్రియ - శ్రీనివాసరెడ్డి** ల కల్యాణం డిసెంబర్ 13వ తేదీ తిరుమలలో అవదూత దత్తుపీఠం కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. కొత్త జంటకు లాయర్' అభినందనలు.



గూడూరు వాస్తవ్యులు ఎమ్.వెంకటస్వామి - సరోజనమ్మల కుమారుడు **సునీల్‌కుమార్ - శ్రావణ్ణి** ల వివాహ రిసెప్షన్ ఈ నెల 14వ తేదీ గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీభవన్ నందు వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి లేట్ పొన్నవోలు రాధాకృష్ణారెడ్డి(నెల్‌క్యాస్ ఫౌండర్) కుమార్తె కుమారి దివ్యారెడ్డి, కుమారుడు దీపక్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# గూడూరు డివిజన్ వార్తలు

## ప్రభుత్వ భూములను
## ఆక్రమిస్తే కఠినచర్యలు

*- తహశీల్దార్ వెంకటనారాయణమ్మ*



అర్జీలను పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటనారాయణమ్మ

గూడూరు మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని తహశీల్దార్ వెంకటనారాయణమ్మ తెలిపారు. గూడూరు పట్టణంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో 15వ తేదీ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గాంధీనగర్ వద్ద వున్న ఇందిరమ్మకాలనీలో ప్రభుత్వం మంజూరుచేసిన లబ్దిదారులే ఉండాలని, లేనిపక్షంలో ఆ ఇంటిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. సుమారు 1000మంది దాకా రుణమాఫీ బాండ్లను అందజేసినట్లు తెలిపారు. 200దాకా రుణమాఫీ రానివారు అర్జీలు ఇచ్చినట్లు, అర్హులై రుణమాఫీ అందనివారు తమ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు తీసుకొచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రెండో విడత జాబితాకు కమిటీగా ఏర్పడి చేయనున్నామన్నారు. తదుపరి పలు సమస్యలపై అర్జీలు సమర్పించారని అన్నారు.

## ఆర్టీసీ కార్మికుల
## సమస్యల పరిష్కారానికి కృషి



పొనకా దంపతులను సన్మానిస్తున్న ఎపిఎస్ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షుడు కొడవలూరు ధనుంజయరెడ్డి తెలిపారు. గూడూరు డిపో గౌరవాధ్యక్షుడిగా పారిశ్రామికవేత్త, తెలుగుదేశంపార్టీ నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి ప్రమాణస్వీకారం సందర్భంగా 13వ తేదీ గూడూరు ఆర్టీసీ డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు అండగా ఉంటానన్నారు.

గౌరవాధ్యక్షులు పొనకా శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కార్మిక సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. లారీల రంగంలో ఉన్న తనకు కార్మికుల కష్టనష్టాలు తెలుసన్నారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొనకా దంపతులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్, ఎన్ఎంయు రాష్ట్ర నాయకులు చంద్రయ్య, శ్రీనివాసరావు, రమణారెడ్డి, డిపో మేనేజర్ మురళీకృష్ణ, యువనేత కోడూరు మీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు
## కంటి అద్దాలు



మాట్లాడుతున్న రామమోహన్‌రావు

గూడూరు ఎస్.సి, బి.సి బాలికల వసతిగృహ విద్యార్థినులకు సుమారు 350మందికి కంటి అద్దాలు, టూత్ బ్రెష్‌లను ఈనెల 14న ఉచితంగా పంపిణీ చేసినట్లు ఎస్.వి.రత్నం చారిటీస్ ట్రస్టు ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు 'లాయర్'కు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కమిటి మెంబర్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాసిన నాగులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు
## సర్పంచుల సహకారం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడివో వెంకటనారాయణ

గూడూరు మండలంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై 15వ తేదీ గూడూరు మండల కార్యాలయంలో ఎంపిపి పిట్టి రావమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సమీక్షించారు. వివిధ శాఖ పనితీరుపై చర్చించారు. మండలంలోని నెర్నూరు, పుట్టంరాజువారి కండ్రిగ గ్రామాల్లో కొత్తగా చౌకదుకాణాలను ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ప్రజాప్రతినిధులు కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు సర్పంచుల సహకారం అవసరమని, ప్రజలు కూడా సహకరిస్తే అపరిశుభ్రత లేకుండా చూసే వీలుంటుందని ఎంపిడివో వెంకటనారాయణ తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరి అయినందున వాటిని విధిగా పొందాలని సూచించారు. అందుకు ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ పథకం తీరుతెన్నులపై సభలో ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటనారాయణమ్మ, జడ్పీటీసీ పద్మజ, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## బలిజ అభ్యుదయ సేవాసంఘం సేవలు విస్తృతం

బలిజ అభ్యుదయ సేవాసంఘం ద్వారా సేవలను విస్తృతం చేయాలని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు చదలవాడ హరిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో ఉన్న డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో 14వ తేదీ రాత్రి ఆ సంఘం ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఏర్పాటై ఎనిమిదేళ్లు గడిచిందన్నారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహించామని, అదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అందరూ సంఘటితంగా ఉండి సమస్యల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మదనమేటి రమణయ్య, మలిశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా పసుపులేటి భాస్కర్‌రావు, కోశాధికారిగా సనిశెట్టి వెంకటేశ్వర్లు, రవికుమార్‌తో పాటు మరికొంతమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్ వాటంబేడు శివకుమార్, ఉక్కు జనార్ధన్, సురేష్, కె.మునిగిరీష్‌లు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగార్థులకు మంచి అవకాశాలు లభించగలవు. బంధువర్గంతో స్వల్ప విభేదాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. ఆర్థిక వ్యవహారాలలో, లావాదేవీలందు ఆచితూచి వ్యవహరించండి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగి, ఆదాయం సామాన్యంగా ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం, ప్రయాణాలు చేయడం వల్ల అదనపు ఖర్చులుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబ వ్యవహారాలు విసుగుపుట్టించినా సంయమనం పాటించండి. శుభకార్యాల ప్రయత్నాలు ఫలిస్తాయి. అనుకోని ప్రయాణాలు, కొత్త వస్తువులు కొనడం జరుగుతుంది. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు దొరకడం, ప్రముఖులతో పరిచయాలు, కొత్తగా ఆర్థిక పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి. ఆర్థిక స్థితి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

రావలసిన బాకీలు కొంతవరకు వసూలు కాగలవు. సాంకేతిక కళాక్రీడారంగాల వారికి అభివృద్ధి బాగుంటుంది. స్తిమితంగా, ఇతరుల సలహాలు విని నిర్ణయాలు తీసికొనవలసి ఉంటుంది. ఎందుకనగా టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఆర్థికాభివృద్ధికి చేసే కృషి ఫలితాలలో కొంత వరకు విజయం సాధిస్తారు. కోర్టు కేసులు వాయిదా పడవచ్చు. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. బిడ్డల విద్యా ఉద్యోగ, శుభకార్య ప్రయత్నాలలో అనుకూల వార్తలు వింటారు. కొన్ని ఆశించిన పనులు సునాయాసంగా జరుగుతాయి. సంప్రదింపులు, ఆర్థిక ఒప్పందాలకు అనుకూల సమయం. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు కొంత లభించడం, కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 19.11.2014 నుండి**
**తేది. 25.12.2014 వరకు**

ఈ వారము మీనంలో కేతువు, కర్కాటకములో కుజుడు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, ధనుస్సులో రవిబుధశుక్రులు, మకరంలో కుజుడు, తుల వృశ్చిక ధనుమకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 23 మంగళవారము నుండి ధనుపుష్యమాసం శూన్యమాసము.

తేది 25 గురువారము క్రిస్‌మస్

ముహూర్తములు లేవు.

**మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 19 | శుక్ర | ద్వాదశి | ఉ॥గం.9.13వ॥ |
| తేది. 20 | శని | త్రయోదశి | ఉ॥గం.9.06వ॥ |
| తేది. 21 | ఆది | చతుర్దశి | ఉ॥గం.8.32వ॥ |
| తేది. 22 | సోమ | అమావాస్య | ఉ॥గం.7.30వ॥ |
| | పిదప | పుష్యశుక్లపాడ్యమి | పూర్తిగ |

**పుష్య మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 23 | మంగళ | విదియ | రా॥గం.4.24వ॥ |
| తేది. 24 | బుధ | తదియ | రా॥గం.2.20వ॥ |
| తేది. 25 | గురు | చతుర్థి | రా॥గం.12.05వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

గృహ మార్పులు, స్థానమార్పులుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడటం, బంధువుల అనారోగ్య వార్తలు వింటారు. ఉద్యోగులు అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. ఆర్థిక సమస్యలు, కుటుంబసమస్యలు చికాకు పరుస్తాయి. దుబారా ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు చేజారిపోవచ్చును. ఆశించిన ఆదాయం ఉండదు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి జీవనం కలవారికి ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు సామాన్య రాబడి స్థితి ఉంటుంది. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. విలువైన వస్తువులు కొనడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. అదనపు ఖర్చులుండినా ఇబ్బంది పడరు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తివ్యాపారాలలో మీ కొత్త పథకాలు ఉపయోగపడి ఆదాయం పెరుగుతుంది. ప్రముఖులను, చిరకాల మిత్రులను కలుసుకొంటారు. ఉపయోగపడే ముఖ్య సమాచారాలు అందుకుంటారు. శుభకార్యాల ప్రయత్నాలు నెరవేరగలవు. చేపట్టిన పనులు జాగ్రత్తగా నిర్వహించగలరు. ఉద్యోగులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. రావలసిన బాకీలు కొంత అందుకుంటారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వస్తు వాహన గృహ రిపేర్లు చేపట్టగలరు. శుభకార్య ఖర్చులు, ప్రయాణ ఖర్చులు ఎక్కువ కాగలవు. పనులందు ఆటంకాలెదురైనా పట్టుదలతో నెరవేర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలలో క్రొత్త పద్ధతులు, కొత్త ఆలోచనలు అమలు చేయడం, ఆర్థికంగా స్థిమిత పడటం, ఆదాయం పెరగడం ఉంటుంది. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాలకు అనుకూలత ఉన్నది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వృత్తి వ్యాపారాల నిర్వహణలో స్థిరపడతారు. అయితే కొత్త పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు ఋణాలు చేయవలసి రావచ్చును. కొన్ని అనవసర ఖర్చుల నుండి తప్పించుకొనలేరు. శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తపడండి. అనుకున్న పనులు ఒకటి రెండు చేయలేకపోవడం జరుగుతుంది. పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

బిల్లులు చెల్లింపులు జరుపుతారు. ఆస్తి వ్యవహారాలు వాయిదా వేయండి. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనాలి. శుభకార్యాలు నిర్ణయం కావడం, పాల్గొనడం జరుగుతుంది. దూరప్రయాణాలుంటాయి. ఆర్థికంగా బాగుండుట, ఆదాయం పెరుగుదల, వృత్తివ్యాపారాలలో పోటీ నెదుర్కొని నిలబడటం జరుగుతుంది. అయితే ఏదో ఒక రూపంలో అదనపు ఖర్చులుంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

విధి నిర్వహణలో అధికారులకు ఉద్యోగులకు మంచి గుర్తింపు గౌరవాలుంటాయి. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. దూరప్రయాణాలు చేయడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. విద్యాప్రగతి బాగుంటుంది. అన్ని విషయాలలోను, పనులలోను ఉత్సాహాన్ని ప్రతిభను ప్రదర్శిస్తారు. కోర్టు వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శుభకార్యాలలో పాల్గొనడం, ప్రయాణాలు, వీటి వల్ల అదనపు ఖర్చులుంటాయి. గృహోపకరణాలు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులకు మంచి ఆర్థికస్థితి, ఆదాయం ఉంటుంది. వృత్తి జీవనం కలవారికి ఆర్థిక ప్రోత్సాహం బాగుంటుంది.

# ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వాలు

## - సిపిఎం నేత జక్కా వెంకయ్య విమర్శ

బిజెపి, టిడిపి నేతలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించాయని, ఆ పార్టీల ఏకపక్ష నిర్ణయాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సిపిఎం నేత జక్కా వెంకయ్య విమర్శించారు. ఈ నెల 13న నెల్లూరులో జరిగిన సిపిఎం నెల్లూరు నగర 22వ మహాసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ విధానాలనే బిజెపి అమలు చేస్తోందని, అటు ప్రధాని నరేంద్ర మోడీ, ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా రుణాల మాఫీ, నిరుద్యోగ భృతి వంటి హామీలను ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు పట్టించుకోవడం లేదని, రైతుల రుణాల మాఫీ కూడా పూర్తిస్థాయిలో జరగలేదని ఆయన విమర్శించారు. ఈ సభల్లో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ, కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. ఈ సభల్లో సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, మూలం రమేష్, జి. నాగేశ్వరరావు, పి.చంద్రారెడ్డి, షేక్ మస్తాన్‌బీ, పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి

రాజకీయాలకు అతీతంగా పోరాడిన పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలని, ఆయన కాంశ్య విగ్రహాన్ని నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అసెంబ్లీ ఆవరణలో పెట్టాలని పొట్టి శ్రీరాములు అవార్డు గ్రహీత, అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి.చలమయ్య డిమాండ్ చేశారు. పొట్టి శ్రీరాములు 62వ వర్ధంతి సందర్భంగా 14వ తేదీ ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని పార్లమెంటు ఆవరణలో పెట్టాలని, చిత్రపటాన్ని పార్లమెంటు హాలులో పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టి తీర్మానం చేయాలన్నారు.

# విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులంతా విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ఆత్మకూరులోనూ విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ కె.ఆదిశేషయ్య ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది అందరూ కలసి విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేశారు. ఎంతో విలువైన విద్యుశ్ఛక్తి ఏ రూపంలోనూ వృధా కాకుండా చూసుకునేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా డి.ఇ అధికారులకు సూచించారు. వినియోగదారులు సాధారణ బల్బులు, ట్యూబ్‌లైట్ల స్థానంలో తక్కువ విద్యుత్ వినియోగమయ్యేలా తక్కువ వోల్ట్‌ల బల్బులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వీలైనంతవరకు ఎయిర్ కండిషనర్లు ఆఫ్ చేసుకోవడం, ఫ్యాన్లు మాత్రమే వినియోగించుకోవడం వల్ల విద్యుత్‌ను పొదుపు చేసుకోవచ్చన్నారు. అనవసరంగా విద్యుత్‌ను వాడుకోవడాన్ని మానుకోవాలన్నారు. విద్యుత్ పొదుపుకు సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు సురేంద్రబాబు, ఎం.ఆనంద్, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విశ్వనాథం, మల్లికార్జునరెడ్డి, సుకుమార్, వెంకటసుబ్బయ్య, అమరలింగం, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంతాపం

తిరుపతి ఎమ్మెల్యే ఎం.వెంకటరమణ మృతిపట్ల మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

# కలువాయి అభివృద్ధికి మరింత కృషి

## ఎంపి వరప్రసాద్, జడ్పీ ఛైర్మెన్‌ల హామీ



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, తిరుపతి ఎంపి వరప్రసాద్

కలువాయి మండలం అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని, ఈ మండలంలో పలు అభివృద్ధి పనులను చేపట్టి మండలాభివృద్ధికి బాటలు వేస్తామని తిరుపతి ఎంపి వరప్రసాద్, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి హామీ ఇచ్చారు. ఈ నెల 13న వారు కలువాయి మండలంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పరమ అధ్వాన్నంగా వున్న రామన్నగారిపల్లి, చింతలాత్మకూరు, వెరుబోట్లపల్లి రింగ్‌రోడ్‌లను పరిశీలించారు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ, ఎంతో కాలంగా మరమ్మతులకు నోచుకోని ఈ రోడ్లను బాగుచేయించేందుకు చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులతో సంప్రదించి వీటికి అవసరమైన నిధులు కేటాయించేందుకు కృషిచేస్తామని అన్నారు. అదేవిధంగా, వెంకటరెడ్డిపల్లె మెయిన్‌రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపి, జడ్పీఛైర్మెన్ మండలంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర, బాలికల హాస్టళ్ళను తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. బాలుర హాస్టల్ ప్రహరీ నిర్మాణం కోసం ఎంపి నిధుల నుంచి రూ. 3. 5లక్షలను మంజూరు చేయిస్తామని ఎంపి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బాలుర, బాలికల హాస్టళ్ళలో అవసరమైన మౌలిక సదుపాయాల కోసం రూ. 5. 50 లక్షలు మంజూరైనాయని, అందుకు సంబంధించిన పనులను సత్వరం చేపట్టాలని జడ్పీ ఛైర్మెన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు, జడ్పీటిసి సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపిపి సంపూర్ణమ్మ, మండల ఉపాధ్యక్షుడు ఎంవి కృష్ణారెడ్డి, పలువురు వైఎస్సార్సీపి నాయకులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ దేవస్థానం వద్ద 'స్వచ్ఛభారత్'

చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో వున్న ప్రముఖ గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి ప్రాంగణం వద్ద సోమవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి, ఆలయ పరిసరాలన్నిటినీ పరిశుభ్రం చేశారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ కమిటీ వారు ఈ కార్యక్రమం నిర్వహించి, ఆలయ పరిసరాల్లో చెత్తనంతా పరిశుభ్రం చేశారు. మొక్కలు నాటారు. ఆలయ ఛైర్మెన్ వరిదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఛైర్మెన్ సింహాద్రిమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# దిగ్విజయం



- గగనతలంలో భారత్ మరో అద్భుత విజయం
- అంతరిక్ష రంగంలో రెపరెపలాడిన భారత కీర్తిపతాక
- మానవ సహిత రాకెట్ ప్రయోగాలకు ఇది తొలి అడుగు

గగనతలంలో భారత్ మరో అద్భుత విజయం సాధించింది. జిఎస్ఎల్వి మార్క్-3 రాకెట్ ప్రయోగం దిగ్విజయమైంది. దీంతో, అంతరిక్ష రంగంలో ఇస్రో శాస్త్రవేత్తలు భారత్ కీర్తిపతాకను మరోసారి రెపరెపలాడించినట్లయింది. ఈ ప్రయోగ విజయంతో మానవ సహిత అంతరిక్ష యాత్రకు భారత్ తొలి అడుగు వేసినట్లయింది. సొంతగడ్డపైనుంచే మానవ సహిత అంతరిక్ష యాత్రలు జరిపేందుకు అవసరమైన అధ్యయనానికి సంబంధించిన తొలి పరిశీలనాత్మక ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించి ఇస్రో శాస్త్రవేత్తలు అందరి అభినందనలూ అందుకున్నారు. 43.43 మీటర్ల ఎత్తు, 630.58టన్నుల బరువున్న ఈ భారీ రాకెట్‌ను శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా ప్రయోగించి, వ్యోమగామి మాడ్యూల్ (క్రూ మాడ్యూల్ అట్మాస్పియరిక్ రీఎంట్రీ ఎక్స్‌పెరిమెంట్-కేర్)ను విజయవంతంగా పరీక్షించారు. ఈ విజయంతో శాస్త్రవేత్తల్లో ఆనందాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

గురువారం ఉదయం 9.30 గంటలకు శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రంలో వున్న రెండవ లాంచ్‌ప్యాడ్ నుంచి జియో సింక్రోనస్ లాంచ్ వెహికల్ మార్క్-3 (జిఎస్ఎల్వి మార్క్-3) రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకువెళ్లింది. రాకెట్‌లోని ఘన, ద్రవ దశలన్నీ శాస్త్రవేత్తలు నిర్దేశించిన రీతిలో అత్యద్భుతంగా పనిచేశాయి. రాకెట్‌ను ప్రయోగించిన 5.4 నిమిషాలకు భూమికి 126.15 కిలోమీటర్ల ఎత్తులో వుండగా, రాకెట్ శిఖరభాగంలో వున్న కేర్‌మాడ్యూల్ విడివడింది. అది తిరిగి భూ వాతావరణంలోకి ప్రవేశించి, అండమాన్‌కు 180 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో సురక్షితంగా దిగి సంకేతాలు పంపింది. శాస్త్రవేత్తల అంచనాలకు తగ్గట్టుగానే రాకెట్‌లోని అన్ని వ్యవస్థలూ అత్యద్భుతంగా పనిచేసి, వ్యోమగామి మాడ్యూల్‌ను సురక్షితంగా భూమి మీదకు తీసుకువచ్చింది. ఈ ప్రయోగం అత్యద్భుతంగా విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలతో పాటు, ప్రజలు కూడా సంతోషంతో ఉప్పొంగిపోయారు. భవిష్యత్తులో మానవ సహిత అంతరిక్ష యాత్రలు జరిపేందుకు సంబంధించిన ఈ తొలి పరిశీలనాత్మక ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తల్లో ఆనందం మిన్నంటింది.

కాగా, మరో రెండేళ్లలో పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తిస్థాయి జిఎస్ఎల్వి మార్క్-3 రాకెట్ వాహకనౌకను సిద్ధం చేయనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ ఛైర్మెన్ రాధాకృష్ణన్ ఈ సందర్భంగా ప్రకటించారు. ప్రయోగం తర్వాత, ఆయన శ్రీహరికోటలో శాస్త్రవేత్తలనుద్దేశించి మాట్లాడారు. ఈ వాహకనౌక సిద్ధమైతే భారీ ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశ పెట్టడంతో పాటు, వ్యోమగాములను పంపేందుకు కూడా వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. శాస్త్రవేత్తలందరి సమిష్టి కృషితోనే జిఎస్ఎల్వి మార్క్-3 రాకెట్ విజయవంతమైందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన శాస్త్రవేత్తలందరినీ అభినందించారు.

ఇదిలావుంటే, జిఎస్ఎల్వి మార్క్-3 ప్రయోగ విజయం పట్ల భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సంతోషం వ్యక్తం చేస్తూ, ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. రోదసి ప్రయోగ పరిజ్ఞానంలో భారత్ సామర్థ్యాన్ని మరోసారి రుజువు చేసిందని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా, భారత ప్రధాని నరేంద్రమోడీ కూడా ఈ ప్రయోగ విజయం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, శాస్త్రవేత్తలను అభినందించారు. ఇది మన శాస్త్రవేత్తల సత్తాకు, శ్రమకు మరో నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపే దిశగా ఇదో ముఖ్యమైన అడుగు..అని ఆయన అభినందించారు. ఈ రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో దేశప్రజలు, ప్రముఖులు అందరూ కూడా ఆనందాతిరేకాలు వ్యక్తం చేస్తూ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు.



తమిళనాడు మాజీసీఎం జయలలిత అన్ని కష్టాల నుండి గట్టెక్కి తిరిగి తమిళనాడు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ ఇటీవల సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళపరమేశ్వరి అమ్మవారికి పూజలు చేయడానికి వెళ్తున్న తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షులు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, పక్కన తమిళనాడు మంత్రి బి.వి.రమణ

# భగవద్గీత పుస్తక పంపిణీకి వేమిరెడ్డి వితరణ



ప్రముఖ పారిశ్రామికవేత్త, వితరణశీలి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరుజిల్లాలోని 500ప్రభుత్వ పాఠశాలలకు లక్షరూపాయలు విలువజేసే భగవద్గీత పుస్తకాలను జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి ద్వారా అందజేసినట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సుఖదేవస్వామి తెలిపారు. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో గీతా జయంతి సంబరాలు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించామని, విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువలు పెంపొందాలన్న ఉద్దేశ్యంతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భగవద్గీత పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు.

# ఉగ్రవాదానికి చరమగీతం పాడాలి

- పెషావర్ ఘటనపై ఆందోళనలు
- నెల్లూరులో విద్యార్థి సంఘాల ప్రదర్శనలు

పాకిస్తాన్‌లోని పెషావర్‌లో విద్యార్థులపై అమనుషంగా కాల్పులు సాగించి అనేకమంది విద్యార్థులను పొట్టన బెట్టుకున్న ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ జిల్లాలోని పలు విద్యాసంస్థలు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదుల దాడులకు నిరసనగా ఆందోళనలు నిర్వహించాయి. అభం శుభం తెలియని విద్యార్థులపై దాడులు చేయడం, తరగతి గదుల్లో అమానవీయంగా కాల్పులు జరిపి విద్యార్థులను హతమార్చడం దారుణమని విద్యార్థి సంఘాలు తీవ్ర ఆవేదన, ఆందోళన వ్యక్తం చేశాయి.

### టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో :

పెషావర్ ఘటనపై టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలో బుధవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులంతా కలసి నగరంలోని విఆర్‌సి సెంటర్‌లో ఉగ్రవాద దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో అమృల్లా, సాయి కిషోర్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, కె.మురళి, వంశీనాయుడు, దేవా, ముర్తుజా, శరత్‌లు పాల్గొన్నారు.

### ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరసన:

పెషావర్‌లో విద్యార్థులపై ఉగ్రవాదులు జరిపిన దాడులకు నిరసనగా నగరంలో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు డి. అంజయ్య, శ్రావణి, గౌతమి, సుభాష్, ప్రణీత్, హర్ష కుమార్ తదితరుల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఉగ్రవాదంపై సంఘటిత పోరాటం అవసరమని, ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని వారు కోరారు.

### బిసిఎస్ఎఫ్ కార్యకర్తల ర్యాలీ :

పాకిస్తాన్‌లోని పెషావర్‌లో విద్యార్థులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను తీవ్రంగా నిరసిస్తూ బిసి స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నగరంలోని వేదాయపాళెం సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లీలాకృష్ణయాదవ్, జిల్లా అధ్యక్షుడు కేశవ నారాయణ, బిసి నాయకుడు శివాచారి తదితరులతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# మాటలతో ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

జరగలేదు. ఋణమాఫీ ఆధార్‌కార్డులు, గ్యాస్, రోడ్లు, డ్రైనేజీ, మంచినీళ్లు, సాగునీరు వంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిందన్నమాటేగాని జిల్లాకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. జిల్లాలో అభివృద్ధి పనుల కోసమంటూ మంత్రిగా నారాయణ నిధులేమీ తేలేదు. జిల్లాలో ఈ ఆరునెలల్లో ఒక్క అభివృద్ధి పనికి కూడా శంకుస్థాపన జరగలేదు. అయితే జిల్లాలో మంత్రి నారాయణతో వున్న సన్నిహిత సంబంధాల దృష్ట్యానో, లేక ఆయనను విమర్శించి శత్రువులం కావడం ఎందుకనుకున్నారో ఏమో గాని మెజార్టీ వైకాపా ఎమ్మెల్యేలు మంత్రిపై విమర్శలకు దూరంగా వుండిపోయారు. కాని నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ మొదటగా మంత్రి మీద దాడికి శ్రీకారం చుట్టారు.

అనిల్ ఒకటికి నాలుగుసార్లు అదే పనిగా విమర్శల వర్షం కురిపిస్తుండడంతో మంత్రి కూడా ఈ మధ్య బాలకృష్ణ 'సింహా' సినిమా చూసినట్లున్నాడు... ఆ సినిమాలోని డైలాగ్‌లతో రెచ్చిపోయాడు. "నన్ను ఒకవైపే చూడండి, రెండోవైపు చూడాలనుకోకండి" అంటూ ఆవేశంతో ఊగిపోయాడు. దీంతో అనిల్‌కు మద్దతుగా నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రంగంలో దిగారు. మంత్రి సినిమా డైలాగ్‌లకు కోటంరెడ్డి తెలివిగా కౌంటర్ ఇచ్చారు. తెలుగుదేశంపార్టీ కోసం ఆస్తులు పోగొట్టుకుని ఇప్పుడు పదవులు లేక ఖాళీగా వున్న నాయకుల పట్ల సానుభూతి చూపుతూ మంత్రిపై విమర్శలు చేయడంతో వన్ షాట్‌తో టూ బర్డ్స్‌ను కొట్టినట్లయ్యింది.

ఇక వైకాపాలో మేయరై తెలుగుదేశంలో చేరిన అజీజ్‌నూ కోటంరెడ్డి వదల్లేదు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాకే మేయర్ ఎన్నిక జరిగింది. ఆరోజు కూడా వైకాపా నుండి అజీజ్ మేయర్‌గా ఎన్నిక కాగలిగాడంటే అది నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు గట్టిగా కార్పొరేటర్లను పార్టీలో నిలబెట్టబట్టే! కాని ఇప్పుడు అదే అజీజ్ నెల్లూరు ఎమ్మెల్యేలిద్దరిపై విమర్శలు చేస్తున్నాడు.

మంత్రిపై నెల్లూరు ఎమ్మెల్యేలిద్దరూ చేస్తున్న విమర్శలను కొందరు తెలుగుదేశం నాయకులు కూడా ఎంజాయ్ చేస్తుండడం విశేషం. మొత్తానికి జిల్లా రాజకీయాలు చప్పగా సాగుతున్నాయనుకునే తరుణంలో మంత్రి, వైకాపా ఎమ్మెల్యేల మధ్య రేగిన మాటలయుద్ధం రంజుగా వుంది.



ఈ నెల 18వ తేదీన నెల్లూరు మాగుంట లే అవుట్‌లో శ్రీ వెంగమాంబ పంజాబీ ఫ్యామిలీ డాబాను ప్రారంభిస్తున్న విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, ఆనం జయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్ నూనె మల్లిఖార్జున యాదవ్, డి.రాజానాయుడు, యజమాని రామినేని వెంగయ్య తదితరులు

# చెదిరిన సుందర స్వప్నం

శ్రీను గల్పిక

అది ఐఆర్ 20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల కంపెనీ హెడ్‌క్వార్టర్స్ అయిన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం. మేయర్ అబ్దుల్ అజీజ్ ఛాంబర్. అక్కడ అబ్దుల్ అజీజ్‌తో పాటూ డిప్యూటీ మేయర్ యం.ద్వారకా నాథ్, కమిషనర్ చక్రధర్‌బాబు, తెలుగుదేశం కార్పొరేటర్లు డాక్టర్ జడ్.శివప్రసాద్, మేకల రజిని, కిన్నెర ప్రసాద్, దాసరి రాజేష్, నూనె మల్లిఖార్జున యాదవ్ తదితరులున్నారు. అక్కడ విలేకరుల సమావేశం ఏర్పాటు చేయబడి వుంది. అజీజ్ మాట్లాడసాగాడు. ప్రియతమ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు సీమాంధ్రను సింగపూర్‌లాగా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆయన స్ఫూర్తితో నేను కూడా సింహపురి నగరాన్ని సిడ్నీ నగరం మాదిరిగా తీర్చిదిద్దాలనుకుంటున్నాను. ఇందుకు తగ్గట్లుగా జాతీయ రహదారి నుండి నెల్లూరులోకి ప్రవేశించే మార్గాల వద్ద అత్యాధునిక స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయిస్తాను. నెల్లూరు ట్రంకు రోడ్డును 8లైన్ల రోడ్డుగా ఇతర రోడ్లను నాలుగులైన్ల రోడ్లుగా అభివృద్ధి చేయిస్తాను. కెవిఆర్ పెట్రోల్ బంకు, నెహ్రూ బొమ్మ, వీఆర్‌సి సెంటర్, ఆత్మకూరు బస్టాండ్‌ల వద్ద 'ఎక్స్', 'వై' టైపు ఫ్లై ఓవర్‌లను నిర్మిస్తాను. నెల్లూరు సిటీలో ఆటోలు, రిక్షాలు, సిటీబస్సులు లేకుండా చేసి వాటి స్థానంలో బెంజ్, ఆడి వంటి ఖరీదైన ట్యాక్సీలను, బెంజ్, వోల్వో సిటీబస్సులను ఏర్పాటు చేస్తాను. నగరంలో డ్రైనేజీ సమస్య లేకుండా చేస్తా... అసలు నగరంలోని డ్రైనేజీ అంతా కూడా ఎక్కడకు పోతుందో తెలియనంతగా ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను రూపొందిస్తాను అని చెప్పాడు. తర్వాత కమిషనర్ చక్రధర్‌బాబు వుండి... నెల్లూరు చెరువును హైదరాబాద్ ట్యాంక్ బండ్‌లా చేసి ప్రేమకథా చిత్రాల షూటింగ్‌కు దానిని ఒక లొకేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆయన ఆ మాటలు చెప్పగానే కార్పొరేటర్లతో పాటు విలేకరులు కూడా చప్పట్లు కొట్టసాగారు. వెంటనే అజీజ్ స్పందించి... మీరు మమ్మల్ని అప్పుడే చప్పట్లు కొట్టి అభినం దించబల్లేదు, ఇవన్నీ జరిగాక ఏకంగా సన్మానసభనే పెడుదురని చెప్పాడు. అందుకు కార్పొరేటర్ కిన్నెర ప్రసాద్ ఉండి... మేం మీరు చెప్పిన మాటలకు చప్పట్లు కొట్టడం లేదు... ముదురుదోమలు కరు స్తుంటే చేతులతో వాటిని చంపుతున్నామంతే అని చెప్పాడు. విలేకరుల సమావేశం ముగిసాక ఎవరిళ్లకు వాళ్లు వెళ్లారు. మేయర్ అజీజ్ కూడా ఇంటికెళ్లి భోజనం చేసి ఏసి వేసి పడుకున్నాడు. నెల్లూరును సిడ్నీ అంత అందంగా ఎలా తయారు చేయాలా? అని ఆలోచిస్తూ అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

అజీజ్ ఇంట్లో నుండి బయటకొచ్చాడు. ఆయన ఉంటున్న హరనాథపురం-ముత్తుకూరురోడ్డు 8లైన్లరోడ్డుగా వుంది. జీబ్రామార్కులు వేసి వుంది. రోడ్డు మీద అన్నీ ఏసి బస్సులు, కార్లు వెళుతున్నాయి. అజీజ్‌కు ఒక్కక్షణం అర్థం కాలేదు. నేను సింహపురిలో వున్నానా? సిడ్నీలో ఉన్నానా? అనే సందిగ్ధంలో పడ్డాడు. అలా ముందుకొచ్చి రోడ్డు పక్కనేవున్న కాలువవైపు చూసాడు... అంతే, ఆయన ఆశ్చర్యానికి అంతులేదు. కారణం... గతంలో డ్రైనేజీతో నిండి వున్న ఆ కాలువలో నీళ్లు కిన్లే మినరల్‌వాటర్ మాదిరిగా ఉన్నాయి. కాలువ అంచులకు చక్కటి లైనింగ్ వుంది. కాలువలో కొందరు స్పీడ్‌బోట్‌లు నడుపుతున్నారు. కాలువ అడుగున చేపలు, తాబేళ్లు క్లియర్‌గా కనిపిస్తున్నాయి. అజీజ్ ఆ ఆశ్చర్యం నుండి కొంచెం కోలుకున్నాక రామలింగాపురం జంక్షన్ వద్దకు వచ్చాడు. అక్కడ కనిపించిన సీన్‌తో ఆయనకు కళ్లు తిరిగినంత పనయ్యింది. అక్కడ 'ప్లస్' టైప్ ఫ్లైఓవర్ వంతెన వుంది. ట్రాఫిక్‌జాం అనేదే లేదు. ఏ వాహనం కూడా ఒక సెకండ్ ఆగే పరిస్థితి లేదు. అది చూసి అజీజ్ మనసులో... నాకు దైవబలమేదో వుంది... నిన్న ఇలా అనుకున్నానో లేదో అన్నీ జరిగి పోయాయి. అల్లా ఉద్దీన్ అద్భుత దీపం కథ నిజమే అయ్యుంటుందనుకుంటూ... మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జి గుర్తుకు రావడంతో అక్కడకు వెళ్లాడు. అప్పుడే భారీ వర్షం మొదలైంది. అప్పటిదాకా అండర్ బ్రిడ్జి చాలా నీట్‌గా వుంది. భారీ వర్షం మొదలు కావడంతో... ఇక ఈ బ్రిడ్జిలోకి నీళ్లు చేరడం ఖాయం, ఒకటో రెండో బస్సులు ఇరుక్కోవడం గ్యారంటీ అని అజీజ్ మనసులో అనుకుంటూ మున్సిపల్ ఇంజనీర్‌కు ఫోన్ చేసి సార్, వర్షం మొదలైంది, మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జిలోకి నీళ్లు చేరి వాహనాలు ఇరుక్కునే అవకాశాలున్నాయి. వెంటనే ఇక్కడ ఇంజన్‌లు ఆన్ చేసి నీళ్లు పంపింగ్ చేయాలి, రండి అని కోరాడు. దానికి అవతల నుండి ఇంజనీర్... మీకేమన్నా పిచ్చా, అసలు ఎవరు మీరు? మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జిలో నీళ్లు నిలవడ మేమిటి? అసలు మీరు నెల్లూరులో వుండే ఫోన్ చేస్తున్నారా? నెల్లూరు గురించి తెలిసే మాట్లాడు తున్నారా? అంటూ ఫోన్ పెట్టేసాడు. అజీజ్‌కు ఒక్క నిముషం ఏమీ అర్థం కాలేదు. వెంటనే తన మిత్రుడు ఆనం వెంకటరమణారెడ్డికి ఫోన్ చేసి... భాయ్ వర్షం వస్తుంది, మాగుంట లేఅవుట్‌లో నీళ్లు బ్లాక్ అయ్యే అవకాశాలున్నాయి. నాలుగు జేసీబీలను తీసుకుని వెంటనే రా భాయ్ అని చెప్పాడు. దానికి అవతల నుండి రమణారెడ్డి... అజీజ్ భాయ్... మధ్యలో దగ్గు... ఈ వయస్సులో కూడా మనం ఏం చేయగలం చెప్పు... మీరు మేయర్‌గా వున్న కాలంలో అంటే వయస్సు ఉన్నది కాబట్టి ఓపిగ్గా నిలబడి చేశాం, ఇప్పుడు ఎక్కడ నిలబడగలం, ఈ వయసులో కూడా మీకెందుకు శ్రమ, ఇంటికెళ్లి శుభ్రంగా పడుకోండని చెప్పి ఫోన్ పెట్టేసాడు. ఆనం వెంకటరమణారెడ్డి తామేదో ముసలివాళ్లమై పోయినట్లు మాట్లాడడంతో అజీజ్‌కు ఏమీ అర్థం కాలేదు. అప్పుడే అటుగా ఒక కారు వచ్చింది. ఆ కారులో నుండి ఓ వ్యక్తి దిగాడు. ఆయనను చూడగానే అజీజ్ ఆశ్చర్యంగా... మీరు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కదా అని అడిగాడు. అవును అని అతను చెప్పాడు. మీకేంటి తల నెరిసింది, గడ్డం నెరిసింది... ముసలివాళ్లయిపోయారు అని అడిగాడు. అందుకు కోటంరెడ్డి... భూమి అన్నాక చెట్టు మొల వడం, వయసు పెరిగాక జుట్టు నెరవడం కామనే కదా భాయ్ అని చెప్పాడు. అప్పుడే కోటంరెడ్డి కారులో నుండి ఇద్దరు దిగారు. వారిద్దరినీ అజీజ్‌కు నా మనుమడు, మనుమరాలు అని కోటంరెడ్డి పరిచయం చేశాడు. మీకప్పుడే మనుమడు, మనుమరాలు ఏంటి భాయ్ అంటూ అజీజ్ ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు. అదేంటి భాయ్... నీకు మాత్రం మనవళ్లు లేరా అని కోటంరెడ్డి అడిగాడు. నాకు మనుమళ్లా... అసలు మనమిప్పుడు ఏ సంవత్సరంలో ఉన్నామని అజీజ్ అడిగాడు. దానికి కోటంరెడ్డి... మనమిప్పుడు 2044సంవత్సరంలో ఉన్నాము. నేను ఎమ్మెల్యేగా, మీరు మేయర్‌గా ఉన్నప్పుడు నెల్లూరు నగరాన్ని ఇలా చేయాలని కలలు కన్నాము, అది ఇప్పటికి నెరవేరిం దని చెప్పాడు. అప్పుడే వర్షం పెద్దదైంది... అజీజ్ అండర్ బ్రిడ్జికేసి చూస్తున్నాడు. కాని వానలో పడిన చినుకు పడినట్లే మాయమవుతుంది. అండర్‌బ్రిడ్జిలోకి ఒక్క బొట్టు నీరు కూడా చేరడం లేదు. అజీజ్, కోటంరెడ్డితో... బ్రిడ్జిలో నీళ్లే నిలవడం లేదు భాయ్ అని చెప్పాడు. కోటంరెడ్డి వుండి... దాదాపు 50ఏళ్ల పాటు ఈ బ్రిడ్జిలో నీళ్లు నిలిచాయి... ఈమధ్యే ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేసి బొట్టు నీళ్లు కూడా నిలవకుండా చేసారని చెప్పాడు. అదేంటి... ఈ డ్రైనేజీ వ్యవస్థను రూపొందించిందే నేను... ఇప్పుడు మేయర్‌ను కూడా నేనే కదా అని అజీజ్ అన్నాడు. దానికి కోటంరెడ్డి... నీ తర్వాత 9మంది మేయర్‌లు వచ్చారు. తలా ఒక పని చేస్తే నెల్లూరు ఇప్పటికి ఇలా తయారయ్యిందని కోటంరెడ్డి చెప్పాడు. ఇప్పుడు నేను కూడా ముసలివాడినయ్యానా? అని అజీజ్ అడిగాడు. నేను అయితే ఆటోమేటిక్‌గా నువ్వు అయినట్లే కదా అని కోటంరెడ్డి చెప్పాడు. అజీజ్‌కు నమ్మబుద్ధి కాలేదు. వెంటనే పక్కనే ఉన్న బార్బర్ షాపులోకి వెళ్లాడు. నిలువెత్తు అద్దంలో తన రూపం చూసుకున్నాడు. నెరిసిన జుట్టు, తెల్లటి గడ్డం... మడతపడిన చర్మం.. వృద్ధాప్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. అంతే 'కెవ్వ్వ్...' మంటూ బాధతో కేకపెట్టాడు. ఆ కేకకు పక్కనే వున్న ఆయన భార్య ఉలిక్కిపడి లేచి... ఏమైందండి అంటూ అజీజ్‌ను లేపింది. అజీజ్‌కు అప్పటిదాకా వచ్చింది కల అని తెలుసుకోవడానికి అరగంట పట్టింది. కొంచెం తేరుకున్నాక తనకొచ్చిన కల గురించి తన శ్రీమతికి చెప్పాడు. అది విని ఆమె... మీరు నిన్న సింహపురిని సిడ్నీలాగా చేయాలనే దానిమీద బాగా ఆలోచించి నట్లున్నారు. మీ ఆలోచనలకు అనుగుణంగా నెల్లూరు తయారు కావాలంటే ఎంతకాలం పడుతుందనేది భగవంతుడు కల ద్వారా చెప్పాడని సముదాయించింది.

## కదంబం

## అమృతసిద్ధి

- బి.కళాగోపాల్
నిజామాబాద్. 94416 31029

తెల్లారి లేస్తే గరమ్‌చాయ్‌లూ,
కులాసా దిలాసా ముచ్చట్లు,
మీడియా న్యూస్ ఛానెళ్ళ
ఉడుకుతున్న సొగ సెగల తాజా కబుర్లు!
కొన్ని నవ్వులూ, కొన్ని విషాదాలు,
నలుపు తెలుపుల వర్ణపటంలో...
ఓ కామన్‌మ్యాన్ నైరూప్య చిత్రాన్ని
అల్లుకుపోతున్న పికాసో కుంచె!
దేహమంతా ప్రవహిస్తోన్న
జ్ఞాపకాల ఆర్కైవ్‌లు!
తీరుబడిగా నెమరువేసుకుంటున్న
మెదడు పొరల డిజిటల్ ఫ్రేములు!
టు బి ఆర్ నాట్ టుబి
ప్రశ్నల దురదగొంటు మొక్కలను
ఎటువైపు నుండి నరుక్కురావాలి?
చీలుతున్న విశ్వమానవుణ్ణి
అతికించడానికి నేడు ఏ కచుడూ
సంజీవినీ విద్యను ప్రయోగించలేడు.
కానీ అక్కడో రససిద్ధుడు..
చీలిక పేలికల బతుకుముళ్ళను
విప్పదీసుకుంటూ,
కొండకచో చిక్కులు పడ్డ జీవనాధారాలను
శృతి చేసుకుంటూ,
అప్పుడప్పుడు ఎదురయ్యే దిగుళ్ళ పగుళ్ళను
నవ వసంత సమీరాలను
సమపార్శ్వాలుగా స్వీకరిస్తూ
తనదైన దైహిక ప్రపంచంలోకి సాగిపోతున్న
ఆ సాహితీపిపాసకుని సృజనాత్మక ప్రయాణం
అదో అవధుల్లేని
అమృతానంద సిద్ధ తపస్యం!!

## వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు

నెల్లూరు మూలాపేటలో వున్న రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా జనవరి 14 వరకు జరుగనున్న తిరుప్పావై మహోత్సవాల వివరాలతో బ్రోచర్‌ను ఈ నెల 13న ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస అయ్యంగార్ మాట్లాడుతూ, స్వామివారికి ఈ మాసంలో సుప్రభాతం బదులుగా తిరుప్పావై పఠిస్తారని, ప్రత్యేకపూజలు, సేవలు నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా, జనవరి 1న ముక్కోటి ఏకాదశి, వైకుంఠద్వార దర్శనం, 4న సామూహిక గోదాదేవి అష్టోత్తర పూజ, 14న భోగిపండుగ, కళ్యాణం, 15న మకర సంక్రమణం, 16న కనుమపండుగ, తోట ఉత్సవం, 17న పెన్నా పండుగ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంపత్‌స్వామి, రఘురామ్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల జయంతి



మధురగాయకుడు పద్మశ్రీ ఘంటసాల 92వ జయంతి వేడు కలు నెల్లూరులోని టౌన్‌హాలులో ఈ నెల 14న ఘనంగా జరిగాయి. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వా హకుడు కేతా సుబ్బారావు ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వొమ్మిన నాగసతీష్ బాబు అధ్యక్షత వహించారు. భవాని నాగేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా విశ్వనాధరెడ్డి, ఎం.కుమార్, శ్రీరామకృష్ణ, సతీష్‌కుమార్, లవకుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన పాటలు, నృత్యాల పోటీల్లో విజేతలైనవారికి బహుమతులను ప్రదానం చేశారు.

## 27 నుంచి అథ్లెటిక్ మీట్

ఈ నెల 27, 28, 29 తేదీల్లో మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగనున్నాయని అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణమ్మ తెలియజేశారు. జిల్లాస్థాయి పోటీల్లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ మీట్‌కు ఎంపికైన జిల్లా వెటరన్స్ ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు రెండు ఫోటోలను, వయస్సు ధృవీకరణ పత్రాలను ఏసి స్టేడియంలో నిర్వాహకులకు అందజేయాలని కోరారు. వీటితోపాటు సభ్యత్వ రుసుము పొందుపరచాలని వారు వివరించారు.

## 21న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

ప్రముఖ కరాటే క్రీడా గ్రాండ్‌మాస్టర్ షిహాన్ వి.దేవానంద్ జన్మదినాన్ని పురస్కరించు కుని దేవ్‌గోజు-ఆర్‌వైయు కరాటే ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వతేదిన 3వ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ కప్-2014 పోటీలు ఘనంగా నిర్వహించనున్నట్లు కరాటే మాస్టర్ ఎన్.వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని ఏసి సుబ్బారెడ్డి ఇన్‌డోర్ స్టేడియంలో 21న ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరి ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని, కరాటే క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేం దుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు మెడల్స్ అందజేస్తామన్నారు.

# ధన్యవాదాలు




సంస్కృతి సంప్రదాయాలు వేదికగా, ప్రాచీనకళలు, కళారూపాల వేడుకగా

## ఉత్తర అమెరికా తెలుగు సంఘము(తానా)

ఆధ్వర్యంలో డిసెంబర్ 18వ తేదీ గురువారం

ఉ॥ 9.00 గంటల నుండి రాత్రి 10.00గంటల వరకు జరిగిన

## "చైతన్య స్రవంతి"

సంబరాన్ని నభూతో నభవిష్యత్‌లా నిర్వహించి

చిరస్మరణీయ వేడుకగా ఈ పండుగను జరపడానికి సహకరించిన

"తానా" బృందానికి, పారశాలల యాజమాన్యాలకు,

కళాబృందాలకు, కళాకారులకు, సాహితీవేత్తలకు,

మీడియా సోదరులకు,

స్థానిక సహకారం అందించిన కమిటీ మిత్రులకు,

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ యాజమాన్యానికి

తమ శ్రమతో ఈ సంబరాలను అంబరాన్ని తాకించిన ప్రతిఒక్కరికీ

కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు.

ఇట్లు
కార్యనిర్వాహక కమిటీ

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com